# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

|| prajakshetram.in ||



అతి కొద్ది కాలంలోనే ఆదరణ పొందిన 'ప్రజాక్షేత్రం' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మండలాల వారిగా నియోజకవర్గాల వారిగా, జిల్లాల వారిగా

రిపోర్టర్లు కావలెను

అనుభవం గలవారికి ప్రాధాన్యం ఇవ్వబడును

ప్రజాక్షేత్రం

కాల్ : 9177920459



సంపుటి - 01 | సంచిక : 280 | హైదరాబాద్ | బుధవారం 26 - 02 - 2025 | పేజీలు - 6 | వెల.4/-




# 5 లక్షల కొత్త ఉద్యోగాలు

- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ఫార్మా క్లస్టర్లతో భారీ ఎత్తున ఉపాధి
- త్వరలో లైఫ్ సైన్సెస్ విధానం.. లైఫ్ సైన్సెస్ వర్సిటీ
- పెట్టుబడులకు మరింత సులభతర విధానం అమలు
- ఫార్మా, ఐటీ, డిజిటల్‌హెల్త్‌ల్లో పవర్‌హౌసగా హైదరాబాద్
- బయో ఏషియా-2025 ప్రారంభోత్సవంలో సీఎం
- 11ఫార్మా సంస్థలతో రూ.5400 కోట్ల ఒప్పందాలు
- క్వీన్స్‌లాండ్ ప్రతినిధులతో రేవంత్, దుద్దిళ్ల భేటీ

'ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్య ఫార్మా క్లస్టర్స్ అభివృద్ధి చేస్తున్నాం. వాటి ద్వారా 5 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యం" అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే తొలిసారిగా.. త్వరలో తెలంగాణలో 'లైఫ్ సైన్సెస్ పాలసీ'ని తీసుకురానున్నట్టు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు మరింత సులభతరమైన విధానం రూపకల్పన, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తామని మంగళవారం ఇక్కడ ప్రారంభమైన 'బయో ఏషియా 2025' సదస్సులో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ సదస్సు మంగళవారం నగరంలోని హెచ్ఐసీసీలో ప్రారంభమైంది. సీఎం రేవంత్ ఈ సదస్సును ప్రారంభించారు.

# కాంగ్రెస్ పతనం ప్రారంభం

- 15 నెలలకే రేవంత్ పాలనపై ప్రజల్లో విరక్తి: కేటీఆర్
- ప్రభుత్వాన్ని జంకు లేకుండా జనం తిడుతున్నరు
- 15 నెలల పాలనలో మూడు భారీ ప్రమాదాలు
- పెద్దవాగు, సుంకిశాల, ఎస్ఎల్‌బీసీ దుర్ఘటనలు
- 48 గంటల్లో ఏడుగురు రైతులు చనిపోయినా.. టన్నెల్‌లో 8 మంది చిక్కుకున్నా సీఎంకు పట్టదు
- ఇటు ఎమ్మెల్సీ ప్రచారం.. అటు ఢిల్లీ పయనం
- రోమ్ తగలబడుతుంటే నీరోలా రేవంత్‌రెడ్డి తీరు
- టన్నెల్ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలి
- నీతులు చెప్పే శ్రీహరి రాజీనామా చేసి గెలవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్
- కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన 700 మంది స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ నాయకులు

**ఇది 'నీరో' సర్కార్!**

15 నెలల రేవంత్ పాలనపై ప్రజల్లో విరక్తి ఏర్పడింది. నిర్భయంగా ఇష్టమొచ్చినట్టు తిడుతున్నరు. రేవంత్‌రెడ్డి కనిపిస్తే ప్రజలు కొట్టేపరిస్థితి కనిపిస్తున్నది. 48 గంటల్లోనే రాష్ట్రంలో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నా, ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 8 మంది చికుకొని ఉన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నడు. ఇప్పుడు 36వ సారి ఢిల్లీకి పోయిండు.

-కేటీఆర్







## ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా


**మార్చి 1 నుంచి ప్రారంభం**

రాష్ట్రంలో మం గళవారం (ఫిబ్రవరి 25) నుంచి ప్రారంభం కావాల్సిన ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వాయిదా పడింది. బి.టెక్, బి.ఫార్మసీతో పాటు బిఎస్‌సి అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వ హించే ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ మార్చి 1 నుంచి మొదలవుతుందని కన్వీనర్ డీన్‌కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మంగళవారం సా యంత్రం 4.45 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉండగా, తాజాగా నిర్ణయం ప్ర కారం మార్చి 1(శనివారం) నుంచి దరఖా స్తు లు స్వీకరించినున్నట్లు వెల్లడించారు.

# దగాపడ్డ రాష్ట్ర పునర్నిర్మాణం

- రాష్ట్రంలోని ప్రజలందరికీ వర్తింపు
- ప్రీమియం ప్రభుత్వమే కడుతుంది
- ఎన్టీఆర్ వైద్యసేవ కింద 25 లక్షలు
- గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలం
- ప్రార్థనాలయాల జోలికొస్తే వెన్నెముక విరగ్గొడతాం
- గవర్నర్ ప్రసంగానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలుకూటమి ఏర్పాటు లక్ష్యమిదే: చంద్రబాబు
- 2026 జూన్ 12 నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణం
- స్కూల్స్ తిరిగి ప్రారంభించేనాటికి మెగా డీఎస్సీ
- మేలో తల్లికి వందనం.. ఈ ఏడాదే అన్నదాతా సుఖీభవ
- ఒక్కో రైతుకు 3 విడతల్లో రూ.20 వేల సాయం
- ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 'సూర్యఘర్' పథకం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "రాష్ట్రంలోని ప్రజలందరికీ రూ.2,50,000 ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తున్నాం. ఇందుకు అవసరమైన ప్రీమియం ప్రభుత్వమే బీమాసంస్థలకు చెల్లిస్తుంది. ఆ తర్వాత రూ.25 లక్షల వరకు అయ్యే వైద్యం ఖర్చులను ఎన్టీఆర్ వైద్యసేవ కింద అందజేస్తాం" అని ప్రకటించారు. గవర్నర్



ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ మంగళవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దగాపడ్డ రాష్ట్రాన్ని పునర్నిర్మించడం కోసమే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిశాయని చెప్పారు. "నేను నాలుగో సారి ముఖ్యమంత్రి అయ్యాను. ఇంతకుముందు మూడుసార్లలో ఎప్పుడూ ఇంతటి ఆర్థికపరమైన ఇబ్బందులు లేవు. రాష్ట్ర అభివృద్ధి కోసం సకాలంలో స్పందించి కేంద్రం అందిస్తున్న సహకారం లేకపోతే చాలా ఇబ్బందుల్లో పడేవాళ్లం. ఒకప్పుడు కరెంటు లేని పరిస్థితి నుంచి ఇప్పుడు ఇంటిపైనే కరెంటు తయారుచేసుకునే స్థాయికి వచ్చాం. గౌరవ సభను గౌరవించే సంస్కారం లేని పార్టీ(వైసీపీ) నేడు అసెంబ్లీకి రావడం లేదు. అసెంబ్లీ అంటే గౌరవం. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఒక వేదిక. ఒక పవిత్ర దేవాలయం." అని చంద్రబాబు అన్నారు.

## మహా కుంభమేళా నేటితో ముగింపు

. నో వెహికిల్ జోన్‌గా ప్రయాగ్‌రాజ్



ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా బుధవారంతో ముగియనుంది. ఇదే రోజు మహాశివరాత్రి కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో యూపీ సర్కారు మళ్లీ ఆంక్షలు విధించింది. కుంభమేళా ప్రాంతాన్ని 'నో వెహికిల్ జోన్'గా ప్రకటించింది. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ఉత్తర్వులు అమల్లోకి తీసుకొస్తున్నట్టు తెలిపింది. ఎంట్రీ పాయింట్ సమీపంలోని స్నాన వాటికల వద్దే భక్తులు పుణ్య స్నానాలు చేయాలని, తాజా గైడ్‌లైన్స్ పాటించాలని అధికారులు కోరారు. నిత్యావసర సరుకులను తరలించే వాహనాలకు, వైద్యులు, పోలీసులు, ప్రభుత్వ వాహనాలకు మినహాయింపు ఉంటుందని అధికారులు తెలిపారు.



## ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో.. సర్కారుకు 2 వేల కోట్ల నష్టం

- ఉత్పత్తి, అమ్మకాల లెక్కలే లేవు: కాగ్
- అసెంబ్లీలో నివేదిక.. ఆప్ గందరగోళం
- 21 మంది ఆప్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

లిక్కర్ స్కామ్‌తో ఢిల్లీ ప్రభుత్వానికి రూ.2002.68 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) స్పష్టం చేసింది. ఢిల్లీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం సీఎం రేఖాగుప్తా కాగ్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లొసుగులకు సంబంధించి కాగ్ 20 అంశాలను లేవనెత్తగా.. వాటిల్లో ఒకటి మద్యం విధానం-2021తో నష్టాల చిట్టాపై అసెంబ్లీలో చర్చ జరుగుతుండగా.. ఆప్ ఎమ్మెల్యేలు తీవ్రంగా వ్యతిరేకించారు. వారు గందరగోళం సృష్టించడంతో స్పీకర్ విజేంద్రగుప్తా 21 మంది ఆప్ ఎమ్మెల్యేలు రెండ్రోజులపాటు సస్పెండ్ చేశారు.

## దక్షిణాదిపై డీలిమిటేషన్ కత్తి

- తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యాఖ్య
- మార్చి 5న అఖిల పక్ష సమావేశానికి పిలుపు
- కేంద్రంపై మరో భాషా యుద్ధానికి సిద్ధమని ప్రకటన

చెన్నై: కేంద్రం తమపై హిందీ భాషను రుద్దడానికి ప్రయత్నిస్తోందని అధికార డీఎంకే ఆరోపిస్తున్న నేపథ్యంలో మరో భాషా యుద్ధానికి రాష్ట్రం సిద్ధమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం ప్రకటించారు. సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ స్థానాల పునర్విభజన అంశాన్ని చర్చించేందుకు మార్చి 5న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. జనాభా నియంత్రణకు దారితీసిన కుటుంబ ప్రణాళిక కార్యక్రమాన్ని తమిళనాడు విజయవంతంగా అమలు చేసిన కారణంగా ఇప్పుడు 8 లోక్‌సభ స్థానాలను కోల్పోయే ముప్పును రాష్ట్రం ఎదుర్కొంటోందని స్టాలిన్ తెలిపారు. భారత ఎన్నికల కమిషన్‌లో రిజిస్టర్ అయిన రాజకీయ పార్టీలను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానిస్తున్నట్టు ఆయన చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన పేరిట దక్షిణాదిపై కత్తి వేలాడుతోందని స్టాలిన్ అన్నారు. హిందీ భాషను రుద్దడానికి కేంద్రం ప్రయత్నిస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో మరో భాషాపరమైన యుద్ధానికి కేంద్రం బీజం నాటుతోందా అన్న ప్రశ్నకు అవునని స్టాలిన్ జవాబిస్తూ అందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## మూసీ ప్రక్షాళనలో మొదటి తట్ట నేనే ఎత్తుతా



- రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నానన్నది పూర్తిగా అవాస్తవం
- మెట్రోకు నిధులు, ప్రణాళికలు ఇచ్చిందే నేను
- రీజినల్ రింగ్‌రోడ్డు తెచ్చిందే నేను
- అధిష్ఠానం మెప్పుకోసమే నాపై రేవంత్ ఆరోపణలు

: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో అభివృద్ధిని తాను అడ్డుకుంటున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణ పూర్తిగా అవాస్తవమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఖండించారు. హైదరాబాద్‌లో మెట్రోకు నిధులు, ప్రణాళికలు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో నిర్మాణం చేయదలిస్తే కేంద్రం, తాను ఎందుకు అడ్డుకుంటామని నిలదీశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు నిర్మాణం చేస్తే తమకు అడ్డుకోవాల్సిన అవసరం ఏముంటుందని అన్నారు. రాష్ట్రానికి అవసరమైన కేంద్ర సహాయం, సహకారం ఎప్పుడూ అందిస్తున్నామని, తాము అడ్డుకోవాల్సిన అవసరమే లేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మంగళవారం రాష్ట్ర బిజెపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు.

మూసీ ప్రక్షాళనకు తాను వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తాను అడ్డుకుంటున్నానన్నది పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. సిఎం స్థాయి వ్యక్తి బీజేపీని, తనను విమర్శిస్తూ కాంగ్రెస్ అధిష్టానం మెప్పుకోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ ఆరోపణలు, విమర్శలు దానిలో భాగమేనని పేర్కొన్నారు. ఒక్క సీటులోనే పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 14 నెలలుగా మాట్లాడిన మాటలే ఈ ప్రచారంలోనూ ప్రసంగించారని అన్నారు. సిఎం మాటలను విద్యావంతులు పట్టించుకోరని అన్నారు. తెలంగాణకు ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఆయన అసమర్థతను తమపై రుద్దుతున్నారని అన్నారు.

ప్రజాక్షేత్రం

బుధవారం 26 - 02 - 2025



హర హర మహాదేవ్
గరలమంతా హాలా హలం
...మనస్సంతా లోక క్షేమం
అందుకే విశ్వామంతా విస్తరించెను
నీ నామం.

దక్షుని యజ్ఞం.... సతీ వియోగం.
ఫలితం నేటి జ్యోతిర్లింగ దర్శనం.
మోక్షానికి తిరుగు లేని మార్గం.

నమ్మిన భక్తులకు భోలా శంకరుని అభయం.
యముడొచ్చినా తప్పదు యమపాశం.
ఇదే భక్త మార్కండేయుని కథా సారాంశం.

నీ నామమే కోటి జన్మల పుణ్య ఫలం.
నీ దర్శనమే సర్వ పాప నివారణ ఫలితం.

ఈ మహాశివరాత్రి పుణ్య దినాన అందుకో
మా ప్రణామం.
"హర హర మహాదేవ శంభో శంకర
పాహిమామ్"



శివ్వాం కిరణ్ కుమార్
ప్రధానోపాధ్యాయులు
డి. ఏ. వి. హైస్కూల్
అల్లూరి సీతారామరాజు (జిల్లా)
ఫోన్. నెం. 6281445433

# 5 లక్షల కొత్త ఉద్యోగాలు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకుచెందిన ప్రముఖ అంతర్జాతీయ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. బయో ఏషియా సదస్సు హైదరాబాద్‌ను ప్రపంచ లైఫ్‌సైన్సెస్ రాజధానిగా మార్చిందని పేర్కొన్నారు. ఫార్మా, ఐటీ, డిజిటల్ హెల్త్ రంగాల్లో గడిచిన 25 ఏళ్లుగా హైదరాబాద్‌ను ఒక పవర్ హౌస్‌గా నిలబెట్టిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఫార్మా, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, బయోటెక్ కంపెనీలెన్నో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయని గుర్తుచేశారు. బయో సైన్సెస్‌లో పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న దార్శనికతతో ప్రభుత్వం ముందు నుంచి పనిచేస్తోందన్నారు.

లైఫ్ సైన్సెస్ రంగంలో రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో త్వరలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీని నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో భారతదేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని సీఎం గుర్తుచేశారు. 'రాష్ట్రంలో అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పన ఉంది. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో తెలంగాణ రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. వాటివల్ల విభిన్న రంగాలలో దాదాపు 50 వేల ఉద్యోగాలు రానున్నాయి. అలాగే, కిందటి సంవత్సరం లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.40వేల కోట్లకు పైగా పెట్టుబడులను విజయవంతంగా ఆకర్షించాం. దాదాపు 150 పైగా ప్రాజెక్ట్‌లో ఈ పెట్టుబడులు వచ్చాయి" అని ఆయన వివరించారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రీన్ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోందని, అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయని తెలిపారు. "వచ్చే పదేళ్లలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే కాక.. చైనా ప్లస్ వన్ (అంతర్జాతీయ కంపెనీలు తమ ఉత్పత్తిని చైనాతోపాటు మరో చోట కూడా ప్రారంభించే దిశగా చేస్తున్న యోచన) ఆలోచనలకు సరైన ప్రత్యామ్నాయ కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేస్తున్నాం." అని వివరించారు. కాగా.. ఈ సదస్సులో భాగంగా జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డ్-2025ను సింగపూర్‌కు చెందిన ప్రిసిషన్ హెల్త్ రిసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్యాట్రిక్ టాన్‌కు బహూకరించారు. అలాగే, సదస్సు తొలిరోజునే 11 ఫార్మా కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం రూ.5400 కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకుంది.

**2 లక్షల ఉద్యోగాలు: మంత్రి దుద్దిళ్ల**

ప్రభుత్వం త్వరలో ఏర్పాటుచేయనున్న లైఫ్ సైన్సెస్ వర్సిటీలో సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసే కోర్సులకు రూపకల్పన చేయబోతున్నట్టు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి.. ప్రపంచపటంలో తెలంగాణకు ప్రత్యేక స్థానానికి తీసుకెళ్లిందని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితో తెలంగాణ బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం చేస్తామన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణను నంబర్‌వన్‌గా మార్చడంలో జీనోమ్ వ్యాలీ పాత్ర కీలకమని కొనియాడారు. రాష్ట్రంలో ఉపాధి కల్పనలో లైఫ్ సైన్సెస్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని.. ప్రత్యక్షంగా 51 వేల మందికి, పరోక్షంగా 1.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన, నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు.

**క్వీన్స్‌లాండ్ ప్రతినిధులతో భేటీ**

బయో ఏషియా సదస్సు ప్రారంభం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు.. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్రానికి చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. తెలంగాణలో ఉన్న సానుకూల వాతావరణం, పెట్టుబడులకు కల్పించిన అనుకూల పరిస్థితుల గురించి సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులపై క్వీన్స్‌ల్యాండ్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

# కాంగ్రెస్ పతనం ప్రారంభం

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కా రు పతనం 15 నెలల్లోపే మొదలైందని, అధికార కాంగ్రెస్ పార్టీని వీడి పెద్దసంఖ్యలో నాయకులు తమ పార్టీలో చేరుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్ నుంచి మొన్న, స్టేషన్‌ఘనపూర్ నియో జకవర్గం నుంచి ఇవాళ భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. 48 గంటల్లోనే ఏడుగురు రైతులు ఆత్మ హత్య చేసుకున్నారని, టన్నెల్‌లో ఎనిమిది మంది కార్మికులు చికుకొని ఉన్నా, ముఖ్యమంత్రికి పట్టింపు లేకుండా పోయిందని, ఓ వైపు రోమ్ నగరం తగలబడుతుంటే.. మరోవైపు ఫిడేల్ వాయించిన రోమ్ చక్రవర్తి నీరో తరహాలో రేవంత్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

35 సార్లు ఢిల్లీ వెళ్లినా కనీసం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేకపోతున్నారని, హోంశాఖ, విద్యాశాఖ, సంక్షేమ శాఖలకు మంత్రులను కూడా నియమించుకోలేని అసమర్థుడైన రేవంత్‌రెడ్డి, తెలంగాణ నుంచి కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తాడా? అని ప్రశ్నించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత, మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు మలిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బండారు రవీందర్, సీక రవి, ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సుమారు 700 మంది తెలంగాణభవన్‌లో కేటీఆర్ సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 నెలల్లోనే అధికార పార్టీని వదిలి బీఆర్ఎస్‌లో చేరుతున్నారంటే కాంగ్రెస్ పాలన ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. ఇది రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు సానుకూల పవనాలకు సంకేతమని తెలిపారు.

**కేసీఆర్ పాలనను బీజేపీయే ప్రశంసించింది**

రైతు ఆత్మహత్యలను గణనీయంగా తగ్గించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రశంసించిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ 450 రోజుల పాలనలో రోజుకొకరు చొప్పన 450 మంది రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. గోదావరి జలాలను 80 మీటర్ల నుంచి 618 మీటర్ల పైకి తీసుకొచ్చి కేసీఆర్ కొండపోచమ్మసాగర్‌ను నింపారని, ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా కాళేశ్వరాన్ని నిర్మించారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌లలో 340 పిల్లర్లు ఉండగా, ఒక పిల్లర్‌కు పర్రెపడితే కాంగ్రెస్ నాయకులు నానాయాగీ చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు దున్నపోతు ఈనింది అంటే.. బీజేపీ వాళ్లు దుడ్డెను కట్టేయమన్నట్టు కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసి తెలంగాణ ప్రజల మనసుల్లో విషబీజాలు నాటారని నిప్పులు చెరిగారు.

**అప్పులపై కాంగ్రెస్ అబద్ధాలు**

తెలంగాణ రాష్ట్రం అప్పులపై కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేశారని, అసెంబ్లీలోనే లెక్కలతోసహా గట్టి సమాధానం ఇచ్చామని కేటీఆర్ గుర్తుచేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఏడాదికి 41 వేల కోట్ల అప్పు చేసి సంక్షోభంలో ఉన్న విద్యుత్తు రంగాన్ని సంసరించామని, ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం కట్టామని, మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీళ్లు ఇచ్చామని తెలిపారు. రైతుబంధు రూపంలో 73 వేల కోట్లలను 70 లక్షల రైతుల ఖాతాల్లో వేశామని, 28 వేల కోట్లతో రెండుసార్లు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేశామని, జిల్లాకో మెడికల్ కాలేజీ, వరంగల్లో అతిపెద్ద హాస్పిటల్, ఘన్‌పూర్‌లో కాళోజీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్, అతిపెద్ద టెక్స్ టైల్ పార్, 200 ఉన్న గురుకుల పాఠశాలలను 1000కి పెంచామని వివరించారు. సంవత్సరానికి 40 వేల కోట్ల అప్పుతో ఈ కార్యక్రమాలు చేశామని, కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 14 నెలల్లోనే 1,50,000 కోట్ల అప్పు చేసి ఒక ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదని, కొత్తగా ఒక ఇటుకైనా పేర్చలేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధుకు రామ్ రామ్ అవుతుందని కేసీఆర్ ముందే చెప్పారని, ఈ లక్షన్నర కోట్ల అప్పుతో ఢిల్లీలో కాంగ్రెస్‌ను నడిపిస్తున్నారని విమర్శించారు.

**రేవంత్‌కు రక్షణ కవచంలా మోదీ**

గతంలో ఖమ్మం పెద్దవాగు బ్రిడ్జి కొట్టుకుపోయినా, సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలినా, తాజాగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలినా ఒక్క బీజేపీ నాయకుడు కూడా మాట్లాడటం లేదని, ఇవాళ రేవంత్ ప్రభుత్వానికి రక్షణ కవచంలా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. కాళేశ్వరం పిల్లర్‌కు పర్రెవస్తే హడావుడి చేసిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఈ ప్రమాదాల విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నదని ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదంపై వివరాలు ఇవ్వాలని ఆర్టీఐ కింద అడిగితే, దేశ భద్రతకు సంబంధించినదని రేవంత్ ప్రభుత్వం చెప్తున్నదని విమర్శించారు.

తెలంగాణలో రాహుల్ - రేవంత్ (ఆర్ఆర్) టాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోదీ ఆరోపించారని, ఇప్పటిదాకా బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు కూడా కాంగ్రెస్ సర్కారుపై తీసుకోలేదని మండిపడ్డారు. రూ. 2 కోట్ల లాభం మాత్రమే ఆర్జించిన రేవంత్ బామ్మర్దికి చెందిన శోధ కంపెనీకి రూ. 1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టును రేవంత్‌రెడ్డి అక్రమంగా కట్టబెట్టారని, దీనిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ఆరు నెలలైనా చర్యలు లేవని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంటిపై ఈడీ దాడులు జరిగినా, ఇప్పటిదాకా ఏం జరిగిందో ఈడీ బయటపెట్టలేదని విమర్శించారు. తెల్లారి లేస్తే కేసీఆర్‌ను విమర్శించే రేవంత్‌రెడ్డి, బీజేపీని ఒక్క మాట కూడా అనడని, బీఆర్ఎస్, కేసీఆర్ ఉన్నంత వరకు తమ పప్పులు ఉడకవని కాంగ్రెస్, బీజేపీలు కమ్మక్కై కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు.

# ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో.. సర్కారుకు 2 వేల కోట్ల నష్టం

**కాగ్ లేవనెత్తిన అంశాలు..**

మద్యం పాలసీ-2021లో అడుగడుగునా ప్రభుత్వానికి నష్టం వాటిల్లినట్లు కాగ్ స్పష్టం చేసింది. సరెండర్ చేసిన రిటైల్ లైసెన్స్‌ల స్థానంలో మళ్లీ టెండర్లను ఆహ్వానించలేదని, దీని వల్ల ప్రభుత్వానికి రూ. 890.15 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు స్పష్టం చేసింది. జోనల్ లైసెన్సుల మినహాయింపు వల్ల మరో రూ. 941.53 కోట్లు, సెక్యూరిటీ డిపాజిట్లను సరిగా వసూలు చేయకపోవడం వల్ల రూ. 27 కోట్లు, కొవిడ్ లాక్‌డౌన్ల పేరుతో అడ్డగోలు మినహాయింపులతో ఇంకో రూ. 144 కోట్లు.. ఇలా మొత్తం 2002.68 కోట్ల మేర ప్రభుత్వం నష్టపోయినట్లు కాగ్ నివేదిక వెల్లడించింది. "కొత్త మద్యం పాలసీ రూపకల్పనకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫారసులను అప్పటి ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా విస్మరించారు" అని కాగ్ వివరించింది.

**సగం నాటు మద్యమే**

2021 మద్యం పాలసీ తర్వాత ఢిల్లీలో విక్రయించిన మద్యంలో సగం నాటు సరుకేనని కాగ్ తేల్చింది. "అనేక మంది హోల్‌సేల్ మద్యం వ్యాపారులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) నిబంధనలకు అనుగుణంగా నాణ్యత పరీక్షలను నిర్వహించలేదు. ఎక్సైజ్ ఇంటెలిజెన్స్ సీజ్ చేసిన మద్యంలో సగం నాటు సరుకే ఉంది. అసలు ఎంత ఉత్పత్తి చేశారు? ఎంత మేర విక్రయాలు జరిగాయి? అనే దానికి లెక్కలే లేవు. మద్యం విధానం సాంతం లోపాలమయం" అని కాగ్ నివేదిక వివరించింది. సర్కారు అజమాయిషీలోని హోల్‌సేల్ సంస్థలకు కాకుండా.. ప్రైవేటు కంపెనీలకు పెద్ద ఎత్తున హోల్‌సేల్ లైసెన్సులు ఇచ్చారని, ఎక్సైజ్ సుంకం స్థానంలో భారీ ఎత్తున లైసెన్స్ ఫీజు వసూలు చేశారని ఎత్తిచూపింది. "నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి రెండు దుకాణాలను మాత్రమే కేటాయించాలి. అయితే.. 2021 పాలసీలో 54 రిటైల్ దుకాణాలను కేటాయించారు. ఈ విషయంలో లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి లేదా క్యాబినెట్ నుంచి అనుమతులు తీసుకోలేదు. అడ్డగోలుగా రాయితీలు, సడలింపులు ఇచ్చారు. దేశీయ, విదేశీ మద్యం సరఫరాకు హోల్‌సేల్ లైసెన్సులు లేని 14 బడా వ్యాపార సంస్థలకు కేటాయింపులు చేశారు. ఢిల్లీని 32 జోన్లుగా విభజించి, 22 సంస్థలకు రిటైల్ దుకాణాలను కేటాయించార"ని కాగ్ స్పష్టం చేసింది.

**అంతా కుమ్మక్కయ్యారు**

హోల్‌సేల్ లైసెన్సు పొందిన వారు, జోనల్ లైసెన్సులు పొందిన వారు కుమ్మక్కయ్యారని కాగ్ తేల్చింది. హోల్‌సేల్ లైసెన్సులు పొందిన ఇండో స్పిరిట్ సంస్థకు కావోగలి రెస్టారెంట్లు అనుబంధ సంస్థలని, మహాదేవ్ లిక్కర్ అనే హోల్‌సెల్ సంస్థకు భగవతీ ట్రాన్స్‌ఫార్మర్ కార్పొరేషన్ అనే సంస?కు సంబంధాలున్నాయని తెలిపింది. గౌతమ్ వైన్స్ అనే హోల్‌సేల్ సంస్థకు, ఒయాసిస్ బిస్లరీన్, విజేత బేవరేజన్ సంస్థల్లో వాటాలున్నాయని వివరించింది. అయితే, నాటు మద్యాన్ని విక్రయించారనే ఆరోపణలను మాజీ సీఎం ఆతిషి ఖండించారు. తాము గతంలో కంటే నాణ్యమైన మద్యాన్నే సరఫరా చేశామని వ్యాఖ్యానించారు.

# దగాపడ్డ రాష్ట్ర పునర్నిర్మాణం

**ప్రతిపక్షహోదా ఇచ్చేది నేనుకాదు..ప్రజలు**

"41 ఏళ్ల నా రాజకీయ జీవితంలో ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీ జరగనిస్తాం.. లేదంటే వెళ్లిపోతామనే రాజకీయపార్టీని ఎన్నడూ చూడలేదు. ప్రజలు 11 సీట్లిచ్చారు. 11 గంటలకు వచ్చారు. 11 నిమిషాలున్నారు. 11:11 నిమిషాలకు వెళ్లిపోయారు. ఈ 11 నిమిషాల్లోనే స్పీకర్‌ను, గవర్నర్‌ను అవమానించారు. రాష్ట్రానికి అది చీకటి రోజు. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ ఎమ్మెల్యేగా గెలవలేదు. అయినాసరే అసెంబ్లీకి వస్తానంటే ఒప్పుకొంటారా? 1994లో కాంగ్రెసకు మెజారిటీ రాలేదు. అందువల్ల ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. సంప్రదాయాలు మర్చిపో యి ప్రతిపక్ష హోదా ఇవ్వాలనడం దారుణం. అది నేనో, స్పీకరో ఇచ్చేది కాదు.. ప్రజలివ్వాలి."

**హామీల అమలు**

"ఎన్ని కష్టాలున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ అమలుకు అనుక్షణం పనిచేస్తాం. సామాజిక పెన్షన్ డబ్బు ను రూ. 200 నుంచి రూ. 2000కు పెంచింది టీడీపీ ప్రభుత్వమే. ఆ తర్వాత రూ. 3,000 నుంచి రూ. 4,000 కు పెంచాం. గత ప్రభుత్వం దివ్యాంగులకు ఒక్కపైసా పెన్షన్ కూడా పెంచలేదు. మేము 8,08,570 మంది దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 3,000 నుంచి రూ. 6,000కు పెంచాం. అనారోగ్యంతో మంచానికి పరిమితిమైన వారికి రూ. 15,000 పెన్షన్ ఇస్తున్నాం. ఏటా రూ. 33,000 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం మనదే."

**సంకల్పం మంచిదైతేకొనసాగించాలి**

'కూటమి ప్రభుత్వం వచ్చీరావడంతోనే 204 క్యాంటీ న్లు ప్రారంభించాం. మేనిఫెస్టోలో చెప్పినట్టుగా దీపం పథకం ద్వారా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఈ పథకానికి రూ. 2,684 కోట్ల ఖర్చవుతోంది. ఇప్పటి వరకు దీని కోసం రూ. 686 కోట్లు ఖర్చు చేశాం."

**రాష్ట్రం ఎలా నష్టపోయిందంటే...**

"అభివృద్ధి చేయాలి...సంపద సృష్టించాలి. ఆదాయం పెంచాలి..పెంచిన ఆదాయాన్ని సంక్షేమం కోసం ఖర్చు చేయాలనేదే మా అభిమ తం. టీడీపీ హయాంలో 2018-19లో 11.4 శాతం వృద్ధిరేటుతో 8.74 లక్షల కోట్ల జీఎసడీపీ నమోదైంది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019-20 లో 5.25 శాతంతో రూ. 9.26 లక్షల కోట్ల జీఎసడీపీ నమోదైంది. ఒకవేళ వృద్ధిరేటు 11.4 శాతం కొనసాగి ఉంటే 9.71 లక్షల కోట్ల జీఎసడీపీ వచ్చి ఉండేది. వృద్ధిరేటు తగ్గడం వల్ల రూ. 45 వేల కోట్ల జీఎసడీపీ తగ్గింది 2023-24లో 8.6 శాతం వృద్ధిరేటుతో రూ. 14.22 లక్షల కోట్ల జీఎసడీపీ నమోదైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన 2024-25లో 12.94 శాతం వృద్ధిరేటుతో రూ. 16.6 లక్షల కోట్ల జీఎసడీపీ వస్తుందని అంచనా. ఒకవేళ వైసీపీ చివరి ఏడాదిలో నమోదైన 8.6 శాతం వృద్ధిరేటే కొనసాగితే రూ. 15.44 లక్షల కోట్ల జీఎసడీపీ వచ్చేది. రాష్ట్రం జీఎస్డీపీ రూపంలో రూ. 62,000 కోట్లు కోల్పోయేది. టీడీపీ అధికారంలో ఉండి ఉంటే 2023-24 కు 14.23 శాతం వృద్ధి రేటుతో రూ. 16.46 లక్షల కోట్ల జీఎస్డీపీ వచ్చేది.

రాష్ట్రానికి రూ. 76,190 కోట్ల ఆదాయం అదనంగా వచ్చేది. అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదు. రాబోయే ఏడాది నుంచి 15% సాధించాలి. 2018-19 మార్చి నాటికి రాష్ట్రం అప్పు రూ. 3,75,295 కోట్లు ఉండగా, 2024 జూన్ 4వ తేదీ నాటికి అప్పు రూ. 9,74,556 కోట్లకు పెరిగింది. కేంద్రం అనేక పథకాలు ఇస్తుంది. కానీ వైసీపీ ప్రభుత్వం వాటిని కూడా ఉపయోగించుకోలేదు. జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీరందించాలంటే రూ. 85,000 కోట్లు ఖర్చవుతుంది. ఈ పథకం ప్రకారం 45 శాతం కేంద్రం, 45 శాతం రాష్ట్రం, 10% లబ్ధిదారులు భరించాలి. కానీ, గత ప్రభుత్వం రూ. 27,000 కోట్లు మాత్రమే అడిగింది. అదనంగా రూ. 55,000 కోట్లు కావాలి. వాటికోసం కేంద్రాన్ని అడుగుతున్నాం."

**రూ.80వేల కోట్లతో బనకచర్ల..**

"రాష్ట్రంలోని ప్రజలందరికీ రూ. 2,50,000 ఆరోగ్య బీమా సౌకర్యం తెచ్చేందుకు అవసరమైన ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆ తర్వాత రూ. 25 లక్షల వరకు అయ్యే వైద్యం ఖర్చులను ఎన్టీయార్ వైద్యసేవ ద్వారా అందజేస్తాం. బనకచర్లకు రూ. 80,000 కోట్లు కావాలి. కేంద్రం, రాష్ట్రంతో కలిసి ప్రైవేటు పార్టీలను కూడా కలుపుకుని ఈ ప్రాజెక్టు పూర్తిచేయాలనే ఆలోచనలో ఉన్నాం."

**త్వరలో మెగాడీఎస్సీ**

"మెగా డీఎస్సీకి త్వరలో శ్రీకారం చుడతాం. 16,384 పోస్టులకు పాఠశాలలు ప్రారంభించే లోగా నియామకం చేపట్టి శిక్షణ ఇచ్చి, పోస్టింగ్‌లు వేస్తాం. మే నెలలో తల్లికి వందనం పథకం ఇస్తాం. ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ ఇస్తాం. రైతు భరోసా కింద 3 విడతల్లో ప్రతి రైతుకూ రూ. 20,000 ఇస్తాం. కేంద్రం రూ. 6,000 ఇస్తుంది.. రాష్ట్ర ప్రభుత్వం రూ. 14,000 ఇస్తుంది. మత్స్యకారులకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్టుగా వేటలేని సమయంలో రూ. 20,000 ఇస్తాం."

**పేదరికనిర్మూలన, ఉపాధి కల్పనే లక్ష్యం..**

"స్వర్ణాంధ్రకు 10 సూత్రాలు ప్రతిపాదించాం. ఇందులో పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనకే తొలి ప్రాధాన్యం ఇచ్చాం. స్వర్ణకారుల కార్పొరేషన్‌తో బీసీలకు రూ. 896 కోట్లు విడుదలచేశాం. మత్స్యకారులకు సంబంధించి 217 జీవోను రద్దు చేశాం. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్‌పై తీర్మానం చేసి ఢిల్లీకి పంపాం. గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్, క్వారీల్లో వడ్డెర కులస్థులకు రిజర్వేషన్ కల్పించాం. చేనేతలకు జీఎస్టీ ఎత్తేశాం. అర్చకుల జీతాలు రూ. 15,000కు పెంచాం. నిరుద్యోగ భృతి రూ. 3,000 ఇస్తున్నాం. దేవాలయాల పవిత్రత కాపాడతాం. రాష్ట్రంలో ఏ ప్రార్థనాలయాల జోలికి వచ్చినా వెన్నెముక అదిరేలా చర్యలు తీసుకుంటాం."

**ఉగాది నుంచి 4 పీ విధానం**

"గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు 3 సెంట్ల జాగా, పట్టణాల్లో 2 సెంట్ల ఇంటిజాగా ఇవ్వబోతున్నాం. ఐదేళ్లలో ప్రతిఒక్కరికీ ఇళ్లు కట్టిస్తాం. ఇప్పటి వరకు రాష్ట్రంలో 1,14,000 ఇళ్లు కట్టాం. జూన్ 12 నాటికి 5 లక్షల కొత్త ఇళ్లు కట్టి పేదలకు అంకితం చేస్తాం. ప్రతి కుటుంబానికి ఇంటిజాగా, ఇల్లు, ట్యాప్ వాటర్, టాయిలెట్, సోలార్ పవర్, విద్యుత్, గ్యాస్, ఇంటర్నెట్ లాం టి కనీస సౌకర్యాలు కల్పిస్తాం. పీ 4 పాలసీని ఉగాది రోజు ప్రారంభిస్తాం. పేదవాళ్లను ఆర్థికంగా పైకి తెస్తాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం. రూ. 6.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరాయి. రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడితో 7.50 లక్షల ఉద్యోగాలు తెస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగాలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తాం."

**స్వర్ణాంధ్రసాధిస్తాం**

"రాష్ట్రాన్ని అత్యున్నత స్థానంలో నిలపడం కోసం ఏ రంగంలో ఏం చేయాలన్న అంశాలతో విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేశాం. స్వర్ణాంధ్ర-2047 సాధన కోసం ఈ రోజు ఏంచేయాలి, 3 నెలల తర్వాత ఏవిధంగా ఉండాలన్న స్పష్టమైన ఆలోచనలతో ముందుకెళ్తున్నాం. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల తలసరి ఆదాయం పెంచే బాధ్యత ఎమ్మెల్యేలదే. అసాధ్యమనుకున్న అమరావతి, పోలవరం, రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడం ఈ 8 నెలల్లో చేసిచూపించాం. దీనికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సహకరించారు. ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చింది కాబట్టి మనమందరం గర్వపడే దేశరాజధానిగా తీర్చిదిద్దుతారు. మోదీ ప్రధాని అయ్యేనాటికి ప్రపంచం లో పదో ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌ను ఇప్పుడు ఐదో స్థానానికి తెచ్చారు. 2028-29 నాటికి మూడో ఆర్థిక వ్యవస్థగా తయారవుతుంది.."

# మూసీ ప్రక్షాళనలో మొదటి తట్ట నేనే ఎత్తుతా

కేంద్రం ఆధ్వర్యంలో రీజినల్ రింగ్ రోడ్డును తీసుకువచ్చామని గుర్తు చేశారు. నీటి వివాదాలపై సమిష్టిగా నిర్ణయం తీసుకోవాలని ఆ దిశగా సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేయడం వల్లనే తాను ఇంత గట్టిగా జవాబివ్వాల్సి వస్తోందని అన్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్న తనను పట్టుకొని తెలంగాణకు అడ్డుపడ్డ వ్యక్తి అంటూ మాట్లాడటం రేవంత్ దిగజారుడు తనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఫోన్ ట్యాపింగ్ మీరు విచారిస్తారా.? సీబీఐకి అప్పజెపుతారా.?**

ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలని బీజేపీ కోరిందని కిషన్‌రెడ్డి తెలిపారు. అలాంటప్పుడు తాము ఎందుకు అడ్డుకుంటున్నామని నిలదీశారు. నిందితులు ఎవరి హయాంలో విదేశాలకు వెళ్లారో చెప్పాలని నిలదీశారు. ఇతరదేశాల నుంచి నిందితులను తీసుకురావాలంటే ఎన్నో నియమ నిబంధనలు ఉంటాయని అన్నారు. 1996 నుంచి పోరాటం చేస్తుంటే అనేక సంవత్సరాల తర్వాత బాంబు పేలుళ్ల నిందితులను అమెరికా కోర్టు ఇప్పటికి అనుమతించిందని తెలిపారు. ఒక సీఎం స్థాయి వ్యక్తి పరిపాలనపై అవగాహన లేకుండా ఈ రకమైన మాటలతో నవ్వుల పాలు కావొద్దని కిషన్‌రెడ్డి హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగిస్తే తేల్చే బాధ్యత తమదేనని అన్నారు. కాళేశ్వరం, ఔటర్ రింగ్ రోడ్డు, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోలు, భూముల కొనుగోలు, మేడిగడ్డల మీద అధికారంలో రాకముందు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ, వచ్చాక మాట మార్చి తప్పుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి విధానాలను కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. చేతనైతే దర్యాప్తు చేసి శిక్షించాలని, లేదంటే సీబీఐకి అప్పజెప్పాలని అన్నారు.

**యూరియాకు కొరతేలేదు**

తెలంగాణలో ఎరువుల కొరత ఉందని పత్రికల్లో వచ్చిన వార్తలపై కిషన్‌రెడ్డి స్పందిస్తూ దీనిపై వెంటనే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి జేపీ నడ్డాతో మాట్లాడానని అన్నారు. కేంద్రం స్పష్టంగా రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దాని కంటే ఎక్కువ కోటా విడుదల చేసినట్లు తెలిపిందని అన్నారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగానే కొంతమంది వ్యాపారస్థులు కృత్రిమ కొరత సృష్టించే చర్యలకు పాల్పడుతున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఎరువుల కొరతనే లేదని అధికారులు చెబుతున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా యూపీఏ హయాంలో యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలించేవారని అన్నారు. కానీ మోదీ ప్రభుత్వంలో ఇలాంటి వ్యవస్థలపై ఉక్కుపాదం మోపారని తెలిపారు. రాష్ట్రానికి 9.5 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమైతే 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా పంపామని కేంద్రం పేర్కొందని తెలిపారు. దేశీయంగా 90 శాతం యూరియాను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

రామగుండంలో కూడా ఉత్పత్తిని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. పదేళ్లుగా దేశంలో ఎక్కడా ఎరువుల కొరత లేకుండా కేంద్రం చర్యలు తీసుకుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంకా 1.22 లక్షల టన్నుల యూరియా లెక్కల్లో ఉందని అన్నారు. ఇదిగాక ఆరు వేల టన్నులు కృష్ణపట్నం పోర్టు నుంచి ఆదిలాబాద్‌కు, కాకినాడ నుంచి తెలంగాణకు తీసుకువచ్చేందుకు ప్రణాళిక చేశామన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే అత్యధికంగా తెలంగాణకు కేంద్రం ఎరువుల సరఫరా చేస్తుందన్నారు. యూరియాను రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో అందుబాటులో ఉంచామన్నారు. వీటిని సరఫరా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉన్న ఎరువులను సమర్థవంతంగా రైతులకు ఇబ్బంది లేకుండా పంపిణి చేయాలన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు,రహదారుల భద్రతకు అవగాహన కల్పించాలి

**-జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**విశాఖపట్నం,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు.మంగళవారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో నగర పోలీస్ కమీషనర్ శంఖబ్రత బాగ్చితో కలసి రహదారి భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం విశాఖ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల ద్వారా సంభవించిన మరణాలు క్షతగాత్రుల వివరాలను,వారికి ప్రభుత్వం తరపున అందజేసిన వివరాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు.అదే విధంగా గుర్తు తెలియని వాహనాల ద్వారా ప్రమాదానికి గురైన బాధితులకు అందుతున్న పరిహారం గురించి సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యల గూర్చి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో మేజర్ రోడ్లలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు,పాఠశాల, కళాశాలల పరిసర ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయవలసిందిగా జివియంసి అధికారులను ఆదేశించారు. రోడ్ల పై జీబ్రా మార్కింగ్, రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ లు ఏర్పాటు చేయాలన్నారు. పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్ ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అవసరమైన చోట బస్ షెల్టర్ల ఏర్పాటుతో పాటు భారీ వాహనాలు నిలిపేందుకు ట్రక్-బేలు ఏర్పాటు చేసేందుకు జివియంసి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో అనుమతించబడిన హోర్డింగ్ లు మాత్రమే ఉండాలని,ప్రమాదకరమైన అనుమతి లేని హోర్డింగులు , బ్యానర్లు తదితర ప్రకటనలను తొలగించాలన్నారు.నగరంలో ఫుట్ పాత్ లు ఆక్రమణలకు గురి కాకుండా ప్రజలు వినియోగించుకునేలా పోలీస్, జివియంసి అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన కూడళ్లతో పాటు అవసరమైన చోట సిసి కెమోరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు.రోడ్డు మధ్యలో ఉన్న చెట్ల వల్ల రోడ్లపై వాహనదారులకు లైటింగ్ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి గత సమావేశంలో చర్చించిన అంశాలను చేపట్టిన పురోగతిని సభ్యులకు తెలియజేసారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారి సిహెచ్ శ్రీనివాసరావు, డిసిపి-2 మేరీ శాంతి, పోలీసు,వైద్యారోగ్య శాఖ అధికారులు,జీవీఎంసీ అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు,రహదారుల భద్రతకు అవగాహన కల్పించాలి

**-జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**విశాఖపట్నం,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు.మంగళవారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో నగర పోలీస్ కమీషనర్ శంఖబ్రత బాగ్చితో కలసి రహదారి భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం విశాఖ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల ద్వారా సంభవించిన మరణాలు క్షతగాత్రుల వివరాలను,వారికి ప్రభుత్వం తరపున అందజేసిన వివరాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు.అదే విధంగా గుర్తు తెలియని వాహనాల ద్వారా ప్రమాదానికి గురైన బాధితులకు అందుతున్న పరిహారం గురించి సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యల గూర్చి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో మేజర్ రోడ్లలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు,పాఠశాల, కళాశాలల పరిసర ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయవలసిందిగా జివియంసి అధికారులను ఆదేశించారు. రోడ్ల పై జీబ్రా మార్కింగ్, రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ లు ఏర్పాటు చేయాలన్నారు. పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్ ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అవసరమైన చోట బస్ షెల్టర్ల ఏర్పాటుతో పాటు భారీ వాహనాలు నిలిపేందుకు ట్రక్-బేలు ఏర్పాటు చేసేందుకు జివియంసి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో అనుమతించబడిన హోర్డింగ్ లు మాత్రమే ఉండాలని,ప్రమాదకరమైన అనుమతి లేని హోర్డింగులు , బ్యానర్లు తదితర ప్రకటనలను



తొలగించాలన్నారు.నగరంలో ఫుట్ పాత్ లు ఆక్రమణలకు గురి కాకుండా ప్రజలు వినియోగించుకునేలా పోలీస్, జివియంసి అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన కూడళ్లతో పాటు అవసరమైన చోట సిసి కెమోరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు.రోడ్డు మధ్యలో ఉన్న చెట్ల వల్ల రోడ్లపై వాహనదారులకు లైటింగ్ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి గత సమావేశంలో చర్చించిన అంశాలను చేపట్టిన పురోగతిని సభ్యులకు తెలియజేసారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారి సిహెచ్ శ్రీనివాసరావు,డిసిపి-2 మేరీ శాంతి,పోలీసు,వైద్యారోగ్య శాఖ అధికారులు,జీవీఎంసీ అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖ పబ్లిక్ లైబ్రెరీలో మహా శివరాత్రి మెగా మ్యూజికల్ నైట్

**-పోస్టర్ ఆవిష్కరించిన ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత డా. కంచర్ల**



**విశాఖపట్నం,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** మహా శివరాత్రి సందర్భంగా డా.చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో మెగా మ్యూజికల్ నైట్ నిర్వహించడం అభినందనీయమని ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎస్ఎస్ఎల్ఎల్ క్రియేషన్స్ అధినేత,ప్రముఖ నిర్మాత, కళాభోజ డా.కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. విశాఖ పబ్లిక్ లైబ్రెరీలో ఫిబ్రవరి 26 సాయంత్రం ఏర్పాటు చేస్తున్న మెగా మ్యూజికల్ నైట్ గోడపత్రికను నిర్వాహకులు గెంబలి జగదీష్ తో కలిసి డా.కంచర్ల కార్యాలయంలో ఆవిష్కరంచారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో డా.చిరంజీవి కళాపరిషత్ సంగీతసేవ చేస్తున్నదని, ఈ క్రమంలోనే వార్షికోత్సవ వేడుకలను పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నారని అన్నారు. మెగా అభిమానులు,సంగీత ప్రియులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మహా శివరాత్రికి జాగారం ఉండే భక్తులు ఈ చక్కటి సంగీత విభావరిని వినియోగించుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులు గెంబలి జగదీష్ మాట్లాడుతూ, డా.చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో డా.కంచర్ల అచ్యుతరావు సహకారంతో నిర్వహిస్తున్న వార్షికోత్సవ, మెగా మ్యూజికల్ నైటకి డా.కంచర్ల అచ్యుతరావు మెగా చీఫ్ గెస్ట్ గా వస్తున్నారన్నారు. సంగీత ప్రియులు,ఆహుతుల కోసం ప్రత్యేక వసతి, కార్యక్రమం ఆద్యంతం ఆల్పాహార ప్రసాదం ఏర్పాటు చేసినట్టు వివరించారు. విశాఖలోని మెగా అభిమానులు, డా.కంచర్ల అచ్యుతరావు ఫాలోవర్స్, అభిమానులు,సంగీత ప్రియులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ సుధీర్,నాగు,అరుణ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్లపైనే ఎర్ర జొన్న ఆరబోత.. ప్రమాదాల బారిన వాహనచోదకులు



**ఆర్మూర్ ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంతో పాటు, నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాలు గ్రామాల్లో రోడ్లపై ఇస్టారీతిగా రైతులు పంట ఉత్పత్తులను ఆరబెట్టుకునేందుకు పోస్తున్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని సిద్ధులగుట్ట వెనకాల, ఆలూరు బైపాస్ రోడ్డు తో పాటు మండలాల్లోని గ్రామాల్లోని అన్ని ప్రధాన రోడ్లలో రైతులు పంట ఉత్పత్తులను అరబోయడంతో రోడ్లపై ప్రయాణించే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులు రోడ్లపై పోస్తున్న ఎర్ర జొన్న పంట ఉత్పత్తుల వల్ల అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే ప్రాణాలు హరిలో రంగ హరే అన్న రీతిలో పరిస్థితి తయారైందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై రైతులు ధాన్యం ఆరబోస్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఆరబెట్టేందుకు ప్రత్యేకమైన సిమెంట్ కల్లాలు లేకపోవడం వల్ల రైతులు రోడ్లను వినియోగించుకుంటున్నారు. వరి ధాన్యం, జొన్న, మొక్కజొన్న పంటలను ఆరబోయడానికి రైతులు ఎవరికి వారు సమీపంలోని రోడ్లను కల్లాలుగా వాడుకుంటున్నారు. ఉదయం ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం కుప్పలు చేసి రాత్రిళ్లు అక్కడే ఉంచుతున్నారు. సాయంత్రం, రాత్రి, ఉదయం సమయంలో కుప్పలు గమనించక పోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ఏడాది ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వెళ్లే రోడ్డులో మాక్లూర్ మండల శివారులో మండలం లో ఇలా రోడ్ల పైన కుప్పలుగా పోసిన వరి ధాన్యాన్ని గమనించకుండా ప్రమాదం సంభవించి ఆర్మూర్ మున్సిపల్ ప్రాంతానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి పుచ్చుల సుమన్ దుర్మరణం పాలయ్యాడు. ఇప్పటికైనా ప్రధాన రహదారులపై రైతుల పంట ఉత్పత్తులు ఆరబోయడం వల్ల జరిగే ప్రమాదాలను సంబంధిత అధికారులు అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైతులకు పంట ఉత్పత్తులు ఆరబెట్టు కునేందుకు సరియైన రీతిలో కల్లాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మోడల్ కళాశాలలో ఘనంగా విద్యార్థుల వీడ్కోలు సమావేశం..

**-ముఖ్యఅతిథిగా పాల్గొన్న, మోడల్ స్కూల్. ప్రిన్సిపల్ పెర్క సునీత**

**-వైస్ ప్రిన్సిపాల్ కాసుల రవి కూమార్**



**ఖానాపురం,ఫిబ్రవరి 25, (ప్రజాక్షేత్రం):** మోడల్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు పార్టీ సందర్భంగా ప్రిన్సిపాల్ పెర్కా సునీత మాట్లాడుతు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరిన ప్రిన్సిపాల్ పెర్కా సునీత మరియు ఉపాధ్యాయ బృందం,వరంగల్ జిల్లా బుధరావుపేటలోని ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఎంతో ఘనంగా జరిగింది.రెండవ సంవత్సరం పూర్తి చేసుకుంటున్న విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పెర్క సునీత మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించి కళాశాలకు పేరు తీసుకురావాలని కోరారు. ఉత్తమ పౌరులుగా ఎదిగి సమాజానికి సేవ అందించాలని ఆమె అభిలాషించారు. ఉపాధ్యాయులు వారి సందేశాలను అందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు కోరారు.వీడ్కోలు సమావేశంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతో ఆకట్టుకునేలా ఉన్నాయి. సమావేశం విద్యార్థులు ఉపాధ్యాయులను ఎంతో ఘనంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ కాసుల రవికుమార్ , ఉపాధ్యాయులు మల్లికార్జున్ రావు రాజేందర్ రాజేంద్రప్రసాద్, శ్రీధర్, రాజ్ కుమార్, నయేరా, పద్మావతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ పరిరక్షణకు ప్రతి రూపం పరమశివుడు

**-సేవాభావంతోనే సంపూర్ణ విజయాలు**



**-శివజయంతి ఉత్సవాల్లో నగర పోలీస్ కమిషనర్ బాగ్చీ**


**డాబాగార్డెన్స్, ఫిబ్రవరి25(ప్రజాక్షేత్రం):** ధర్మ పరిరక్షణకు ప్రతి రూపం ఆ పరమ శివుడేనని, రుద్రభూమిలో ప్రత్యక్షమైనప్పటికీ నిస్వార్థంగా లోకానికి వెలుగులు పంచేది కూడా ఆయనేనని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు, శివజయంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాగ్చీ మాట్లాడుతూ నిస్వార్థ సేవలకు ప్రతిరూపం శివుడేనన్నారు.ఆయన నిరంతరం విభూది ధరించి, సామాన్యుడిగానే భక్తులను అనుగ్రహించడం జరుగుతుందన్నారు.పరమ శివుడిని సేవా భావంతో స్మరించుకుంటే సంపూర్ణంగా ప్రతి ఒక్కరికి విజయాలు లభిస్తాయన్నారు.విభజన సమయంలో తనను తెలంగాణ,ఆంధ్ర రాష్ట్రాల్లో ఏక్కడ విధులు నిర్వహిస్తారని ఆప్షన్ అడిగారని,అయితే తాను ఏపీనే ఎంచుకోవడం జరిగిందన్నారు.అందుకు ప్రత్యేక కారణం కూడా ఉందన్నారు.తాను పరమశివుడు భక్తుడనని, ఏపీలో ఎక్కడ చూసినా అత్యంత ప్రాచుర్యం పొందిన శివాలయాలు ఉన్నాయని అందువల్లే ఏపీలో విధులు నిర్వహించడానికి ఇష్టపడటం జరిగిందన్నారు.అప్పికొండ సోమేశ్వర ఆలయంతో పాటు అనేక శివాలయాలు ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. ఈ సందర్భంగా అందరికీ శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.గౌరవ అతిథిగా హాజరైన కేజీహెచ్ సూపరిండింటెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ తాను చిన్ననాటి నుంచి కష్టపడే తత్వంతో ముందుకు సాగానన్నారు.అలాగే భీమిలి ప్రాంతంలో చదువుకున్న సమయంలోనే ఆధ్యాత్మిక భక్తిభావం అలవర్చుకున్నట్లు చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ మాదిరిగానే తాను కూడా నిరంతరం సహాయం అందించడానికి సిద్ధంగా ఉంటానన్నారు. తన వద్దకు వచ్చే రోగులకు నిరంతరం సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇటీవలే బ్రహ్మకుమారీలతో కలసి ప్రత్యేక కార్యక్రమం కూడా తాను నిర్వహించినట్లు చెప్పారు.కార్యక్రమ నిర్వాహకురాలు బి.కె. రామేశ్వరి మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదినం లోకానికి అత్యంత పుణ్యప్రదంగా నిలుస్తుందన్నారు.శివుడిని పూజించే భక్తులందరికీ పాపాల నుంచి విముక్తి కల్పించడమే కాకుండా మంచి జీవితాన్ని ప్రసాదించే మహిమ గల స్వామిగా అభివర్ణించారు. బ్రహ్మకుమారీస్ వివిధ సంస్థలకు చెందిన సత్యవతి, శివలీల, శశికళ తదితరులంతా మాట్లాడుతూ శివరాత్రి గొప్పతనాన్ని తెలియజేశారు. కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ సీనియర్ కోరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ నృత్య కళాకారిణీ ఆరేకె టీనాను అతిథులు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అంతకు ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆలరించాయి. కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మకుమారీస్, జర్నలిస్టులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సాయి జయ బాబు ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



**గండిపేట ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** సిహెచ్ సాయన్న జయ బాబు ట్రస్ట్ ఆధ్వర్యంలో బసవతారక క్యాన్సర్ హాస్పిటల్ దగ్గర అన్నదానం కార్యక్రమం చేయడం జరిగింది. ఇక ఈ యొక్క కార్యక్రమం కుటుంబ సభ్యులు సి.హెచ్.ఉదయ్ కుమార్ సి.హెచ్. క్రాంతి కుమార్ (ట్రస్ట్ చైర్మన్లు)మరియు ఈ యొక్క కార్యక్రమం తదితరులు పాల్గొన్నారు.

## తండ్రిని కొట్టి చంపిన తనయుడు - ఎందుకంటే .. ?



**పరిగి ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** తనకు రావాల్సిన భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం లేదంటూ తండ్రిని కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేయడంతో ఓ తండ్రి మృతి చెందాడు. గ్రామస్తులు, పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం%ౌ% పరిగి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ రహీం( 72 ) అతని రెండో భార్య కుమారుడు పీర్ మహ్మద్ ( పప్పు )తన తండ్రి పనిచేసే సిద్ధార్థ రెడ్డి ఫామ్ హౌస్ వద్దకు సోమవారం రాత్రి వెళ్ళాడు. తనకు రావాల్సిన భూమిని రిజిస్ట్రేషన్ చేస్తావా లేదా అంటూ తండ్రి అబ్దుల్ రహీం తో గొడవపడ్డాడు. ఈ గొడవ చిలికి చిలికి పెద్దగా మారింది. పీర్ మహమ్మద్ తండ్రి అబ్దుల్ రహీం పై ఆవేశం తో కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఇది గమనించిన గ్రామానికి చెందిన నల్లోల నర్సింలు వెంటనే తండ్రి కొడుకులు విడిపించాడు. అప్పటికే గాయాలైన అబ్దుల్ రహీంను వెంటనే పరిగి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమంగా ఉందని నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా పరిగి శివారులోనే మృతి చెందాడు. మృతుడి చెల్లెలు కరీమా బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడు పీర్ మహమ్మద్ అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

ప్రజాక్షేత్రం

బుధవారం 26 - 02 - 2025

## జోరుగా బిజెపి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం




**శంకర్ పల్లి ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):**
బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు(పట్టభద్రులు), మరియు (టీచర్) మల్క కొమురయ్య లకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని సంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మునిపల్లి మండల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి తొండ రవి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధు, రాజ్ కుమార్, నందు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**వలిగొండ,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):**
యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలో ఈ నెల 27 వ తేది న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భముగా స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులను జిల్లా కలెక్టర్ హనుమంత రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ధరణి రికార్డులను పరిశీలించి రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సుచించారు. ఆయన వెంట తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



**కొత్తగూడ,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):**
భార్యాభర్తల మధ్య గొడవ కాస్త చినికి చినికి గాలి వానల మారి క్షనికావేశంలో భర్త ప్రాణాలు పోయేలా చేసింది.కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ప్రకారం కొత్తగూడ మండలంలోని పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన చిన్నిల మురళీకృష్ణకు 11 నెలల క్రితం వివాహం జరిగింది.భార్యాభర్తలు బతుకుదెరువు కోసం హైదరాబాద్ కు వలస వెళ్లారు. ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో తిరిగి గ్రామానికి చేరుకొని భర్త పై ఖానాపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.పిర్యాదు చైయడంతో మనస్తాపం చెందిన మురళీకృష్ణ పురుగుల మందు త్రాగడు గమనించిన బంధువులు నర్సంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.మురళీ కృష్ణ మృతితో పొగుళ్లపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## బాల బాలికల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్సై ఎస్ లక్ష్మి కాంతం



**ప్రత్తిపాడు,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):ప్రత్తిపాడు**
కాకినాడ జిల్లా నియోజవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా చట్టాలు,హక్కులు, బాల బాలికల రక్షణ, సైబర్ నేరాలపై అప్రమత్తత పట్ల ప్రత్తిపాడు ఎస్సై ఎస్ లక్ష్మికాంతం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై ఎస్ లక్ష్మికాంతం మాట్లాడుతూ మహిళల చట్టాలను విద్యార్థినిలకు వివరించారు.ఎవరైనా ఆకతాయిలు, మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అటువంటి విధంగా ఎవరైనా మీతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లయితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ముఖ్యంగా గుడ్ టచ్,బ్యాడ్ టచ్ పై మహిళా పోలీస్ సిబ్బంది ద్వారా వివరించారు. డిజిటల్ అరెస్టులకు అనేవి లేవని అటువంటి విధంగా ఎవరైనా మిమ్మల్ని బ్లాక్ మెయిల్ చేస్తే మోసపోవద్దని అవగాహన కల్పించారు. విద్యార్థిని విద్యార్థులు పాఠశాలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు రోడ్డుకి ప్రక్కగుండా నడుస్తూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అదే విధంగా ప్రేమ పేరుతో వంచన చేసే నయవంచకుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.అటువంటి వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరించి,లవ్ ట్రాప్ జోలికి పోకుండా శ్రద్ధగా చదువుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మహిళా పోలీసులు,పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## తన విధుల పట్ల నిర్లక్ష్యం వైస్తున గుర్రంపొడు తహసిల్దార్

**- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**




**గుర్రంపొడు,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):**
తన విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ,జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలను బేఖాతరు చేసినందుకు,సెలవుల్లో ఉన్న గుర్రంపోడు తహసిల్దార్ జి. కిరణ్ కుమార్ ను,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విధుల నుండి సస్పెండ్ చేశారు. గుర్రంపోడ్ తహసిల్దార్ జి. కిరణ్ కుమార్ విజ్ఞప్తి మేరకు గత నెల 6 నుండి 16 వరకు సెలవును మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ సెలవు ముగిసిన మరుసటి రోజు జనవరి 17న విధులలో చేరని కిరణ్ కుమార్.

## మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసిన డీసీసీ ఉపాధ్యక్షులు



**వలిగొండ,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామంలో అనారోగ్యం కారణల వల్ల వేముల చిన్న నరసింహ, పోలేపాక ఎట్టయ్య, మరణించారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వేముల చిన్న నరసింహ కు రూ. 5 వేలు,పోలేపాక ఎట్టయ్యకు రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ, రూ. 2 వేలు,కసిరిబోయిన లింగయ్య రూ. 3 వేలు వేముల చిన్న నరసింహ కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సుక్క ముత్యాలు,గుట్ట డైరెక్టర్ కొణితల కరుణాకర్,దామెర అంజయ్య,రేఖ,మచ్చ గిరి,చెన్నయ్య, చంద్రయ్య,శ్రీరాములు పాల్గొన్నారు.

## చేవెళ్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య సి సి రోడ్ల శంకుస్థాపన

**- 40 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణం**



**చేవెళ్ల ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):**
నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కాలే యాదయ్య శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్, రేగడి ఘనపూర్, ఇంద్ర రెడ్డి నగర్ (నాంచేరి) గ్రామాల్లో సుమారు 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల కు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కుపల్లి మహిపాల్, మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య, స్థానిక యూత్ అధ్యక్షుడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని వారు తెలిపారు.

# గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న వైయస్ జగన్ పై అనర్హత వేటు వేయాలి

**-ముఖ్యమంత్రి చంద్రబాబుకు కక్ష సాధింపు ఉద్దేశం లేదులి**
**-నిజంగా అతనికి ఆ ఉద్దేశం ఉంటే వైసీపీ నేతలు అందరూ జైలులో ఉండేవారు**
**-తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**



**విశాఖపట్నం,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):**
కేవలం అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి శాసనసభకు హాజరయ్యారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు.మంగళవారం హోటల్ దసపల్లా లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గవర్నర్ అబ్దుల్ నజీర్ శాసనసభలో ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలు నినాదాలు చేయడాన్ని రామ్ తప్పు పట్టారు.ఇటువంటి అప్రజాస్వామ్య చర్యకు మూల కారకుడైన వైయస్ జగన్మోహన్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని స్పీకర్ సి.హెచ్ అయ్యన్నపాత్రుడు ను బి.వి.రామ్ కోరారు. స్వయంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి సోదరి.. వైయస్ షర్మిల కూడా అతని వైఖరిని తప్పుపట్టారన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు పట్టుమని పదకొండు నిమిషాలు కూడా శాసనసభలో లేకపోవడం ఏమిటని అభ్యంతరం వ్యక్తం చేశారు.వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కొనసాగించిన ప్రజా వ్యతిరేక పాలన పై తాను ప్రజాస్వామ్యబద్ధంగా యుద్ధం చేశానన్నారు.ఈ క్రమంలోనే తొమ్మిది పాటలను విడుదల చేసి వైసిపి దుర్మార్గాలను ప్రజలలోకి తీసుకెళ్లానని తెలిపారు.జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా జగన్ కు వ్యతిరేకంగా సమావేశాలు ఏర్పాటు చేశానని తెలిపారు. ఏది ఏమైనా నైతిక విలువలు లేని వైయస్ జగన్ పై అనర్హత వేటు వేయాల్సిన అవసరం ఉందన్నారు.గతంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఏ తప్పు చేయకుండానే అన్యాయంగా 53 రోజులపాటు జైలులో నిర్బంధించారన్నారు.ఒకవేళ చంద్రబాబు నాయుడుకి నిజంగా కక్ష సాధింపు ఉంటే వైసిపి నేతలు అందరూ జైలుకు వెళ్లేవారు అన్నారు.

**ఎమ్మెల్సీగా నూతన అభ్యర్థులకు అవకాశం కల్పించాలి**

ఎమ్మెల్సీ ఎన్నికలలో నూతన అభ్యర్థులకు అవకాశం కల్పించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు.తాజాగా ఎమ్మెల్సీ స్థానాలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బి.వి.రామ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ మీడియా సమావేశంలో జి. వీరభద్రరావు,డాక్టర్ కె.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ చట్టంతో కొత్త చరిత్ర రాయబోతున్నాం..

**- ఎస్సీ కులాలో అసమానతల వల్లే ఆందోళనలు మొదలయ్యాయి**
**- మాదిగ అమరవీరుల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం**
**- మాదిగ అమరవీరుల కుటుంబ సభ్యుల కాళ్లు కడిగిన మంత్రి దామోదర, నాయకులు.**




**హైదరాబాద్ ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):**
త్వరలో ఎస్సీ వర్గీకరణ చట్టం చేస్తాం.. ఆ తర్వాత పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీ చేపడుతామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్త చరిత్ర రాయబోతున్నామని హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో జరుగుతున్న మాదిగ అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదిగ అమరవీరుల కుటుంబ సభ్యుల కాళ్లు మంత్రి దామోదర, నాయకులు కడిగారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున మంత్రి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కులాల్లో అసమానతల వల్లే ఆందోళనలు మొదలయ్యాయని అన్నారు. హక్కుల సాధన కోసం సుదీర్ఘ పోరాటం జరిగిందని, జాతి ప్రయోజనాల కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల కుటుంబాలకు, మాదిగలు జీవితాంతం రుణపడి ఉంటారని వెల్లడించారు. ఎన్ని తరాలైనా అమరుల రుణం తీర్చుకోలేనిదన్నారు. హక్కుల కోసం జరిగే పోరాటాలకు రాజకీయ రంగు పూయకూడదని, మానవత్వంతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వర్గీకరణ విషయంలో అదే జరిగిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపలే వర్గీకరణకు అనుకూలంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేశారని వెల్లడించారు. మాదిగల పట్ల అది ఆయన నిబద్ధత, పేదల హక్కుల పట్ల చిత్తశుద్ధి.. అని కొనియాడారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుకూలంగా, వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేలా అన్ని విధాల అధ్యయనం చేసిన తర్వాత వన్ మ్యాన్ కమిషన్ నివేదిక ఇచ్చిందని, అందులో వంకలు పెట్టడానికి ఏమీ లేదని స్పష్టం చేశారు. వర్గీకరణపై అబద్ధాలు, మోసం, రాజకీయం కోసం విమర్శలు చేయొద్దన్నారు. మీకు ఎక్కడ అవసరమున్నా, ఆదుకునే బాధ్యత మా ప్రభుత్వానిది అని హామీ ఇచ్చారు. మాదిగ అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొన్న ఎమ్మెలేలు కాలె యాదయ్య, వేముల వీరేశం, మాజి మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, చంద్రశేఖర్, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి కార్యక్రమం లో భాగంగా ఐదో శక్తి పీఠమైన శ్రీ జోగులాంబ అమ్మవారి మరియు బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే విజయుడు



**అలంపూర్,ఫి బ్రవరి 25(ప్రజాక్షేత్రం):**
మహాశివరాత్రి కార్యక్రమంలో భాగంగా అలంపూర్ ఆలయంలో నిర్వహించిన ద్వజా రోహణము కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు. ఆలయాలకు విచ్చేసిన ఎమ్మెల్యే విజయుడుకి ఆలయ అధికారులు,అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. శేష వస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఏర్పాటుచేసిన యాగశాల కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఏర్పాటుచేసిన ఏర్పాట్లను ఆలయ ఈవో పురెందర్ కుమార్,ఎమ్మెల్యే కి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టేకుల సోమవారం లో బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాలు




**వలిగొండ,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):**
యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో,రామన్నపేట ప్రాజెక్టు వర్కట్పల్లి సెక్టర్ టేకుల సోమవారం అంగన్వాడి కేంద్రంలో,జిల్లా మహిళా సాధికారత కేంద్రంలో వారు, బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాలు భాగంగా, జిల్లా,మహిళా సాధికారత బృందం మహిళలు అవగాహన కల్పిస్తూ,తమ పిల్లల పట్ల శ్రద్ధ వహిస్తూ లింగ వివక్షత లేకుండా చూడాలన్నారు. అత్యవసరమైన సమయంలో టోల్ ఫ్రీ నెంబర్ 181, మహిళలకు 1098,చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ ఏ విధంగా సర్వీస్ చేస్తుందో అదే విధంగా జన్మించిన చిన్నారి పేరు పైన మొక్కను నాటించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా జెండర్ స్పెషలిస్టులు, భార్గవి,నికిత, అంగన్వాడి టీచర్,మరియు మహిళాలు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజుకు ఆహ్వానం



**ఖమ్మం,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):**
రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను ఖమ్మం టిని-టాట్స్ హైస్కూల్ కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీతో పాటు కలిసి పాఠశాల రజతోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా ఆహ్వానించారు.ఖమ్మం బస్ డిపో రోడ్డులో ఈ పాఠశాల నెలకొంది.తన పాఠశాల రజతోత్సవాల సందర్భంగా వచ్చే నెల (మార్చి)ఒకటవ తేదీన నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా కోరుతూ భాస్కర్ ఎంపీ రవిచంద్రను మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఖమ్మం పెవిలియన్ మైదానం పక్కనే ఉన్న శ్రీభక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం ఉదయం జరిగే ఉత్సవాలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు శెట్టి భాస్కర్, ఆకుల గాంధీలు తెలిపారు.

# మార్చి 8 నుండి పండితాపురంలో శ్రీరామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ జాతర

**-కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి,డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్**



**ఖమ్మం,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** మార్చి నెల ఎనిమిదో తారీకు నుండి 11 వ తారీకు వరకు కొమ్మి నేపల్లి- పండితాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణం మహోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది మహాశివరాత్రి తర్వాత తొమ్మిదవ రోజున ఆనవాయితీ ప్రకారం జాతర కార్యక్రమం ప్రారంభమగునని, మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు. ఈరోజు శివాలయం ప్రాంగణంలో జాతరకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ పురాతన కాలం నుండి వందల సంవత్సరాల క్రితం నుండి కొమ్మినేపల్లి- పండితాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ప్రతి ఏడాది పాల్గొనమాసం శుద్ధ ఏకాదశి నాడు అర్ధరాత్రి 12 గంటలకు జరుగుతుందని, ఈ సందర్భంగా నాలుగు రోజుల పాటు జరిగే జాతర కార్యక్రమానికి దూర ప్రాంతాల నుండి కూడ దాదాపు 50 వేల మందికి పైగా ఖమ్మం, మహబూబాబాద్,భద్రాద్రి కొత్తగూడెం,వరంగల్లు సూర్యాపేట జిల్లాల నుండి భక్తులు పాల్గొంటారని తెలిపారు.గతంలో ఇక్కడ ఎడ్ల పందాలు,కబడ్డీ పోటీలు నిర్వహించడం జరిగిందని, మా చిన్నతనంలో దూర ప్రాంతాల నుండి ఎడ్ల బండ్లు కట్టుకొని వచ్చేవారని గుర్తు చేశారు.మార్చి 8 వ తారీకు స్వామివారి గుడికి తోరణాలంకరణ,9వ తారీకు కళ్యాణం,పదవ తారీకు ఊరేగింపు కార్యక్రమం,11 వ తారీకు పూర్ణాహుతి కార్యక్రమం , సందర్భానుసారంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని మల్లి బాబు యాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బానోతు నరసింహ నాయక్ మేకల మల్లికార్జున రావు,పూజారి రామలింగేశ్వర శర్మ, మేకపోతుల మహేష్,భూక్యా నాగేంద్రబాబు పాడిబండ్ల ప్రసాదు జలగం శ్రీను పాల్గొన్నారు.

# వేములకొండ గుట్టకు నిధులు మంజూరు



**వలిగొండ,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండలం వేములకొండ అరూరు మచ్చ గిరి గుట్ట రోడ్డుకు రూ.26 లక్షల నిధులు భువనగిరి శాసనసభ్యులు, కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంజూరు చేశారు.ఈ సందర్భంగా ఆయనకు మాజీ ఎంపీపీచిట్టిడి జనార్దన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బండారు నరసింహారెడ్డి,మాజీ సర్పంచ్ జినుకుల దానయ్య,ఓబిసి సెల్ మండల అధ్యక్షుడు కనకాచారి,మచ్చగిరి గుట్ట ధర్మకర్త బండి రవికుమార్, సింగల్ విండో డైరెక్టర్ ఆవుల స్వామి,అరూర్ గౌడ సంఘం అధ్యక్షులు బాలశంకర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆవుల సత్యనారాయణ,స్వామి, ఆనంద్,సంతోష్ పాల్గొన్నారు.


# భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ సంబరాలు




**భీంగల్,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** భీంగల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ సంబరాలు ప్రిన్సిపాల్ సి.జయాపాల్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ, నిత్యజీవితంలో విద్యకు ఉన్న అత్యున్నతమైన స్థానము దేనికి లేదని వివరిస్తూ ఈ రెండు సంవత్సరాలలో మీరు నేర్చుకున్న జ్ఞానాన్ని నిత్యజీవితంలో ఉపయోగపడే విధంగా వినియోగించుకుంటారని, రాబోయే పరీక్షలలో మంచి ఉత్తీర్ణత శాతాన్ని అందించి కళాశాలకు మంచి కీర్తి ప్రతిష్టలను తీసుకురావాలని ప్రిన్సిపల్ విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ సతీష్ మాట్లాడుతూ విద్యార్థులకు అమూల్యమైన విషయాలను వివరిస్తూ వారు విద్యార్థులతో మమేకమై వారికి నిత్యజీవితంలో విద్య ఎంత అవసరమో తెల్పుతూ,విద్య వల్లనే గొప్ప కీర్తి లభిస్తుందని ఈ విద్యను ఇష్టంతో చదవాలని కోరారు.ఈ కళాశాలకు మీరందరూ కూడా మార్గదర్శనంగా మిగిలిపోతారని వివరించారు.ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకుడు వి.కృష్ణ దాస్ మాట్లాడుతూ మీ ఉత్తీర్ణత శాతమే ఈ కళాశాలలో మరింత మంది విద్యార్థులను చేరడానికి దోహదపడుతుందని సూచన చేశారు.ఈ కార్యక్రమంలో సాంస్కృతిక నృత్యాలతో పాటు మంచి పాటలను పాడి విజయవంతం చేయుటలో కళాశాల ప్రిన్సిపల్ సి.జయాపాల్ రెడ్డి,సీనియర్ అధ్యాపకుడు వి.కృష్ణ దాస్,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ సతీష్,కళాశాల అధ్యాపకులు,కార్యాలయ నిర్వహణ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# సృజనాత్మకతే వినూత్న ఆవిష్కరణలకు ఆధారం- గుండాల కృష్ణ

**-యస్.బి.ఐ.టి. లో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్ట్ ఎక్స్పో 2025**



**ఖమ్మం,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):** వినూత్న ఆవిష్కరణలు, సృజనాత్మకతతోనే రూపుదిద్దుకుంటాయని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు.మంగళవారం స్థానిక కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్పో- 2025 విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసిందని వారు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇన్నోవెంట్రిక్ డైరెక్టర్ రాజశేఖర్ తో పాటు కృష్ణ జ్యోతి ప్రజ్జ్వలన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఒక మంచి ఆలోచనకు ప్రాజెక్ట్ రూపం అందించేందుకు ఉన్న దశలను వివరిస్తూ విద్యార్థులలోని సృజనాత్మకతకు కావలసిన సహాయ సహకారాలను అందించటంలో తమ కళాశాల ముందుంటుందని వారు తెలిపారు.తదనంతర కార్యక్రమంలో తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకొని వారిలో స్ఫూర్తిని నింపారు.తమ కళాశాలలోని ఇన్నోవేషన్ మరియు ఇంక్యుబేషన్ సెల్ నిరంతరం విద్యార్థులతో మమేకమై వారి ఆలోచనలను పదును పెట్టి నేడు ప్రాజెక్టుగా తీర్చి దిద్దామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి తెలిపారు.ఇటువంటి ప్రాజెక్ట ఎక్స్పోలు విద్యార్థులను మరింతగా ప్రోత్సహిస్తాయని వారు అభిప్రాయపడ్డారు.ఆ దశాబ్దంలో స్టార్ట్ పేరిట ఎన్నో కొత్త కంపెనీలు పుట్టుకు రావటానికి ప్రాధాన కారణం ఈతరం విద్యార్థులలోని వినూత్న ఆలోచనలేఅని కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ తెలిపారు. అటానమస్ హెూదా రావటంతో తమ విద్యార్థులలోని ఆలోచనలకు రూపాన్ని అందించి ఎంట్రప్రెన్యూవర్స్ గా తీర్చిదిద్దేందుకు ఈ ప్రాజెక్ట్ ఎక్స్పో దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.ఈ ఎక్స్పోలో సి.ఎస్.ఈ నుండి 25. ఈ.సి.ఈ నుండి 35 మరియు ఇతర విభాగాలు కలుపుకొని మొత్తం 80 ప్రాజెక్ట్స్ ప్రదర్శించినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా? ఎ.వి.వి. శివ ప్రసాద్, డా? జె. రవీంద్రబాబు ,డాఎం యన్. శ్రీనివాసరావు ,హెచ్.ఒ.డి.లు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దాపురం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం




**నాంపల్లి,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** నాంపల్లి మండల పరిధిలోని పెద్దాపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రోజున ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించినట్లు పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్ లక్ష్మమ్మ తెలిపారు. ముఖ్యమంత్రిగా రామ్ తేజ, కలెక్టర్గా పావని,డీఈఓగా అనూష,హెడ్మాస్టర్ గా ప్రాచీ, సర్పంచ్ గా రాము వివిధ పాత్రలలో విద్యార్థులు పాల్గొన్నారు.కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కవిత హాజరైనారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోశయ్య, మంజుల పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం



**మాక్లూర్,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డికి మద్దతుగా మంగళవారం మాక్లూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ పార్టీ బలపరిచిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున తమ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధిలో దూసుకుపోవచ్చని పేర్కొన్నారు.గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కాంగ్రెస్ ప్రతినిధులు పరిష్కరిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు,సొసైటీ చైర్మన్ బురోళ్ల అశోక్,మాజీ సొసైటీ చైర్మన్ దయాకర్ రావు, మండల అధ్యక్షులు రవి ప్రకాష్,యూత్ అధ్యక్షులు వినోద్, ఓబీసీ జనరల్ సెక్రటరీ గంగోనె రవీందర్,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముదిగొండ మండలం వల్లాపురం గ్రామం లో జాతరకు భారీ పోలీసు బందోబస్తు:ముదిగొండ సి ఐ మురళీ

**-అవాంఛనీయ సంఘటన శాఖలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు...**

**-ట్రాఫిక్ ను నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళిక...**




**ఖమ్మం,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):** ముదిగొండ మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో ఉన్న పురాతనమైన శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయం వద్ద శివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగే జాతరలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ముదిగొండ సీఐ ఓ. మురళి తెలిపారు.అంతేకాకుండా జాతరకు ప్రజలు తీసుకువచ్చే వాహనాల వల్ల ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని స్పష్టం చేశారు. వేలాదిమంది భక్తులు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సరిహద్దుల్లోని జిల్లాల నుంచి హాజరవుతారని పేర్కొన్నారు.ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఖమ్మం సీపీ సునీల్ దత్ ఆదేశాలతో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి పర్యవేక్షణలో పోలీస్ శాఖ ముందస్తు చర్యలు తీసుకుంటుందని వివరించారు.జాతరపై అడుగడుగున పోలీస్ నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా పోలీస్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసి జాతరను పర్యవేక్షిస్తామని చెప్పారు.

# పైల్వాన్ పురం లో ఆర్థిక సాయం అందజేత



**వలిగొండ,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్పురం గ్రామానికి చెందిన వట్టిపల్లి రాములమ్మ గారు ఆకస్మాత్తుగా మరణించారు.వారి కుటుంబ సభ్యులకు ఏజేఆర్ ఫౌండేషన్ ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో రూ.5 వేలు రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## కనీస మద్దతు ధర క్వింటా కు రూ.25 వేలు నిర్ణయం చేసి కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ కొనుగోలు కు కృషి చేయాలని వైరా శాసన సభ్యులు మాలోతు రాందాస్ నాయక్ కి వినతి పత్రం అందజేసిన అఖిలపక్షరైతు సంఘాల ప్రతినిధులు



**ఖమ్మం,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** ఖమ్మం లో మిర్చి బోర్డు ఏర్పాటు కు, కనీస మద్దతు ధర క్వింటా కు రూ.25 వేల నిర్ణయం చేసి కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ కొనుగోలు కు కృషి చేయాలి అని మంగళవారం వైరా శాసన సభ్యులు మాలోతు రాందాస్ నాయక్ కి అఖిల పక్ష రైతు సంఘాల ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు.వైరా నియోజకవర్గ పరిధిలో జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో మిర్చి సాగు అవుతుంది అని మిర్చి రైతులకు వైరస్, తెగుళ్లు,నల్లి మూలంగా నష్టం జరిగింది అని మరోవైపు మార్కెట్లో సరైన ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు అని అన్నారు.అంతర్జాతీయ ఎగుమతులు పై ఆధారపడి మిర్చి సాగు చేయాల్సి వచ్చిన నేపథ్యంలో అంతర్జాతీయ ఎగుమతులు ఎగుడు దిగుడు పై రైతులకు సరైన అవగాహన లేకపోవడం, నూతన వైరస్,తెగుళ్లు, వాతావరణ మార్పులు మూలంగా సంభవిస్తున్న నష్టం సరైన విత్తనాలు ఎరువులు పురుగు మందులు ధరల నియంత్రణ లేకపోవడం రైతులను బలితీసుకుంటున్న పరిస్థితుల్లో సమగ్ర మిర్చి సాగు విధానం రూపొందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉంది అన్ని,మిర్చి పంట ను ఆహార పంట గా కేంద్ర ప్రభుత్వం గుర్తించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరల పంటల జాబితాలో మిర్చి పంట చేర్చి కింటాకు ఇరవై ఐదు వేల రూపాయలు మద్దతు ధర నిర్ణయించి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు నా ఫెడ్, మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని,ఖమ్మం లో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి అని, మిర్చి క్వింటాళ్ల కు ఇరవై ఐదు వేల రూపాయలు మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు కు ప్రత్యేక కృషి చేయాలి అని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు,వైరా పట్టణ కార్యదర్శి చింత నిప్పు చలపతిరావు,కిసాన్ కాంగ్రెస్ నాయకులు శీలం వెంకట నర్సిరెడ్డి,అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎస్ కె ఖాసిం,గిరి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు గారపాటి అశోక్ , తోట నాగేశ్వరరావు,రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

**-కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి**



**నిజామాబాద్,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వ్యక్తి నరేందర్ రెడ్డి కి పట్టభద్రులంతా అండగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించాలని వినయ్ రెడ్డి అన్నారు.ఆర్మూర్ లో పివిఆర్ హెూటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పొద్దుటూరి వినయ్ రెడ్డి మాట్లాడుతూ సోమవారం జరిగిన నిజామాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసిన పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి అచ్చినప్పటి నుండి తెలంగాణలో అనేక అభివృద్ధి జరుగుతుంది.గత ప్రభుత్వం బీఆర్ఎస్ ఆయంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ వచ్చిన 14 నెలల్లోనే 54 వేల ఉద్యోగాలు కల్పించామన్నారు .కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని కోరారు.రానున్న రోజుల్లో నిరుద్యోగులకు ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.అలాగే ఆర్మూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన పైడి రాకేష్ రెడ్డి అభివృద్ధి ఏమి చేసింది లేదన్నారు.ఎమ్మెల్యే అనుచరులు ప్రజలను మోసం చేస్తూ దందుకు తింటున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్,వైస్ చైర్మన్ ఇట్టం జీవన్,గ్రంథాలయ మాజీ చైర్మన్ మారా చంద్రమోహన్,నాయకులు ముత్యారి లింగాగౌడ్,మాజీ మున్సిపల్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్,పండిత్ పవన్, సీనియర్ నాయకులు మచ్చలు జితేందర్,ఆకుల రాము,ప్రసాద్, చిన్నారెడ్డి,ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గాంధీజీ విద్యార్థుల ప్రతిభ.

**చండూరు,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):**



చండూరు పట్టణ కేంద్రంలోని గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో మంగళవారం రోజు కరాటే పోటీలలో ప్రతిభకనబర్చి, పతకాలు సాధించిన విద్యార్థులకు స్థానికులు ఎస్.ఐ. నర్సింగ్ వెంకన్న అభినందనలు తెలియజేశారు. ఆదివారం నాడు నల్లగొండ పట్టణం లోని శివాంజనేయ గార్డెన్స్ లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్షిప్ వారియర్స్ కప్– 2025 లో చండూరు గాంధీజీ పాఠశాల విద్యార్థులు ఏకాంగా పది బంగారు పథకాలు,ఏడు రజత పథకాలు,7 కాంస్య పథకాలు, మరియు 4 ప్రశంస పథకాలు సాధించి విజయ దుందుభి మ్రోగించారు. బంగారు పథకాలను సాధించిన విద్యార్థులు శ్రీనిధి, ఓం, ఐశ్వర్య, చక్రధర్, అభినయ్, లలిత్ కిషోర్, విజయ్ కాంత్ లు,వెండి పథకాలు సాధించిన విద్యార్థులు సహస్ర, దినేష్, చరణ్, అభినవ్, గోపిలతలు, కాంస్య పథకాలు సాధించిన విద్యార్థులు దినేష్, గోపిలత, తేజస్విని, లలిత్ కిషోర్, త్రినాధ్, ఆశ్రిత, విజయ్ కాంత్ లు వున్నారు విజేతలైన విద్యార్థులను చండూరు ఎస్సై నర్సింగ్ వెంకన్న బహుమతులను, మెడల్స్ ను, సర్టిఫికెట్లను అందించి, అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఈ విద్యార్థులు రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో మరిన్ని పథకాలు సాధించి చదువుకున్న పాఠశాలకు, పుట్టిన గ్రామానికి మరియు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ట్రస్మా నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ కరాటే శారీరక దృఢత్వానికీ,మానసిక వికాసానికి దోహద పడుతుందని,ప్రతి విద్యార్థి అంకిత భావంతో కరాటేను నేర్చుకొని రాణించాలని సూచించారు.

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కి ధన్యవాదాలు : అనంత చంద్ర శేఖర్ గౌడ్



**చండూరు,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):**

మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి తల్లికి ప్రతి తండ్రికి క అన్నకొడుకు లాగా మారి కంటి ఆపరేషన్లు చేయిస్తున్నారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మునుగోడు నియోజకవర్గంలో కంటిచూపుతో బాధపడుతున్న ఏ ఒక్కరు ఇబ్బంది పడొద్దంటూ ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు. ఈ వైద్య శిబిరాలు నిరంతర ప్రక్రియ లాగా కొనసాగిస్తున్నారు.. ఫిబ్రవరి 23 న 3వ విడత చండూరు మున్సిపాలిటీ ప్రజలకు వైద్య శిబిరానికి అనూహ్యమైన స్పందన వచ్చింది. ఆ రోజు 410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా,132 మందికి ఆపరేషన్లు పూర్తి చేశారు. ఆపరేషన్లు చేయించి,అలాగే వదిలేయకుండా మరలా వారికి వైద్య పరీక్షలు చేయించి కంటి పనితీరును పరిశీలిస్తారు. శంకర కంటి ఆసుపత్రి లో ఆపరేషన్ చేయించుకున్న ప్రతి ఒక్కరిని పేరు పేరునా ఆత్మీయంగా పలకరించి, ప్రజలందరికీ మన రాజగోపాల్ రెడ్డి సారూ అండగా ఉంటారని చండూరు మున్సిపాలిటీ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్ వారితోపాటు మాజీ సర్పంచ్ నల్లగంటి మల్లేష్ గారు భరోసా కల్పించారు. చండూరు మున్సిపాలిటీ ప్రజల తరుపున మునుగోడు శాసన సభ్యులు రాజగోపాల్ రెడ్డి కి,కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఛైర్మెన్ కోమటిరెడ్డి లక్ష్మీ మేడం కి మరియు శంకర హాస్పిటల్ యాజమాన్యానికి హృదపూర్వక ధన్యవాదాలు.

## తల్లి కొడుకుల ఆత్మహత్య..!

**- గ్రామంలో తీవ్ర విషాదం.**
**- బషీరాబాద్ మండల్ కాసింపూర్ గ్రామంలో ఘటన.**




**బషీరాబాద్ ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం)**

తల్లి కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన బషీరాబాద్ మండల పరిధిలోని కాశింపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు మొగులప్ప (35), తల్లి ఎల్లమ్మ(50) ఒకే కుటుంబానికి చెందిన తల్లి కొడుకు ఇద్దరు ఒకేసారి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మొగులప్పకి భార్య రేణుకకి మధ్య మనస్పర్ధాలతో నిత్యం గొడవలు జరుగుతుండగా.. భార్య రేణుక మొగులప్పపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో మొగులప్ప, తల్లి ఎల్లమ్మ ఇద్దరు తీవ్ర మనవేదనకు గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో చెరో దూలానికి ఉరి వేసుకున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడ్డ మొగులప్ప బట్టల పై రక్తపు మరకలు ఉండటంతో, వీరిది హత్యనా లేక ఆత్మహత్య నా అని అనుమానాలకు దారి తీస్తున్నాయని పోలీసులు తెలిపారు. అనంతరం పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు పోలీసులు ఇంకా వెల్లడించలేదు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

## ప్రాణం తీసిన అతివేగం

**-అదుపుతప్పి పరిశ్రమల్లోకి దూసుకెళ్లిన బైక్**
**-యువకుడు మృతి.**

**కొండాపూర్,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):**



ప్రాణం తీసిన అతివేగం.. అదుపుతప్పి పరిశ్రమంలోకి దూసుకెళ్లిన దుర్ఘటన కొండాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లెపల్లి గ్రామ శివారులోని యు.బి పరిశ్రమల్లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మారేపల్లి గ్రామానికి చెందిన ఉత్తరపల్లి రాములు(40) అనే ఉపాధి రీత్యా యు బి కంపెనీ నందు కాంట్రాక్టర్ వర్కర్ గా పనిచేస్తూ.. అదే క్రమంలో మంగళవారం ఉదయం యధావిధిగా తన మోటార్ సైకిల్ పై కంపెనీలో కి వెళ్తుండగా.. అతివేగంగా అడ్మిన్ బిల్డింగ్ కు కిటికీ అద్దాలకు ఢీకొట్టగా ముఖానికి బలమైన గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. వృత్తిని తండ్రి వీరయ్య ఇచ్చిన దరఖాస్తు మేరకు హరిశంకర్ గౌడ్ కేసు నమోదు చేసుకుని పరిశోధన ప్రారంభి. ఆ మృతి చెందిన కార్మికునికి మానవతా దృక్పథకంతో ప్రజల సమక్షంలో ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సాయం ఆ కుటుంబానికి అందజేస్తామన్నారు.

## వాటర్ ట్యాంకులో నీళ్లు చూడడానికి వెళ్లి ట్యాంక్ లో ఉన్న నిచ్చిన విరిగి వ్యక్తి మృతి.

**కొండాపూర్,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):**



మండల పరిధిలోని గుంతపల్లి గ్రామానికి చెందిన మల్లేపల్లి మల్లేష్ తండ్రి అనంతయ్య, వయస్సు 40 సంవత్సరాలు గురువారం రోజు రాత్రి 9.30 గంటల సమయంలో గుంతపల్లి గ్రామంలోని నీళ్ల ట్యాంక్ లో ట్యాంక్ లో నీళ్లు నిండాయి లేదా అని చూడడానికి వెళ్లి, ట్యాంక్ ఎక్కి ట్యాంక్ లోపలికి నిచ్చెన సహాయంతో దిగుతుండగా, ప్రమాదవశాత్తు నిచ్చెన జారిపోయి నిచ్చనతో పాటుగా అతడు కూడా నీటిలోకి జారిపోయి నీటిలో మునిగి చనిపోయినాడు. మృతుని భార్య అయిన మల్లేపల్లి కల్పన ఇచ్చిన పిర్యాదు కొండాపూర్ హరిశంకర్ కేసు నమోదు చేనుకుని పరిశోధన ప్రారంభించారు.

## సెయింట్ మేరీ స్కూల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం.

**మర్రిగూడ,ఫిబ్రవరి 25, (ప్రజాక్షేత్రం):**

మర్రిగూడ మండలం కేంద్రంలో గల సెయింట్ మేరీ స్కూల్లో సెల్ఫ్ గవర్నమెంట్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు చక్కగా ముస్తాబయి వన్డే టీచర్లుగా వివిధ పాత్రలలో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పులి రాజు ప్రిన్సిపాల్ ఝాన్సీ టీచర్లు పిఈటీ పవన్,మమత,లిల్లీ, స్వప్న, శ్రీలత,స్వాతి,లావణ్య, వసంత,మమత పాల్గొన్నారు.



## ఇళ్ళ స్థలాల సాధన కోసం దశలవారిగా ఆందోళనలు చేద్దామని నిర్ణయం తీసుకున్న మూడు జర్నలిస్ట్ యూనియన్లు

**ఖమ్మం,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):**



ఖమ్మం నియోజకవర్గంలోని ఇళ్ల స్థలాల సాధన కోసం దశలవారిగా పోరాటవే ఏకైక మార్గమని జర్నలిస్టు యూనియన్లు నిర్ణయించాయి.రాష్ట్రప్రభుత్వం గుర్తింపు పొందిన మూడు యూనియన్ల స్టీరింగ్ కమిటి సమావేశం మంగళవారం ఖమ్మం నగరంలోని టిఎన్ జివో భవనంలో జరిగింది. ఖమ్మం నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాల కోసం గత ప్రభుత్వం భూమి కేటాయించినప్పటికి జర్నలిస్ట్ హౌజింగ్ సోసైటికి భూమిని కేటాయించే విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తాత్సారం చేస్తున్నందుకు నిరసనగా ఉద్యమమే శరణ్యమని మూడు యూనియన్లు భావించాయి.గత ప్రభుత్వంలో మంత్రివర్గ సమావేశం తీర్మాణం చేసి జివోలు జారీ చేసినప్పటికి ప్రస్తుత ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని సమావేశం అభిప్రాయపడింది.హైద్రాబాద్ లోని జవహర లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌజింగ్ సోసైటి కి సంబంధించిన విషయంలో సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పును ఖమ్మం సోసైటికి అన్వయించి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని ఈ సమావేశం అభిప్రాయపడింది.జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని స్థంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సోసైటికి కేటాయించేందుకు ప్రభుత్వం పై వత్తిడి తెచ్చేందుకు ఉద్యమబాట పట్టాలని నిర్ణయించాయి. అందులోభాగంగా మార్చి మొదటి వారంలో మూడు యూనియన్లు,స్థంబాద్రి హౌజింగ్ సోసైటి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆ తరువాత దశలవారి ఆందోళనకు వెళ్ళాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మాణించింది.ఈ విషయాన్ని జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల దృష్టికి తీసుకేళ్ళీన తరువాత ఆందోళన బాట పట్టాలని మూడు యూనియన్లు ఏకగ్రీవంగా తీర్మాణించాయి.జర్నలిస్టుల కు ఇళ్ళ స్థలాలే సాధనే ఏకైక ఏజెండాగా పోరుబాట పట్టుతామన్నారు. టియుడబ్ల్యుజె ఐజెయు ఎలక్ట్రాకిన్ మీడియా రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టియుడబ్ల్యుజె (ఐజెయు)ఖమ్మం జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు,టిజెఎఫ్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, స్థంభాద్రి హౌజింగ్ సోసైటి అధ్యక్షులు కనకం సైదులు, కోశాధికారి వై సాంబశివరావు, టిజెఎఫ్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా నాయకులు శేట్టి రజనీకాంత్,టిడబ్ల్యుజెఎఫ్ నుంచి రాము పాల్గొన్నారు.

## ప్రశ్నించే ప్రజా గొంతుక అలుగుబెల్లి నర్సిరెడ్డి ని ఎమ్మెల్సీగా గెలిపించాలని తెలిపిన ఎంసిపిఐ యు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

**నర్సంపేట,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):**




ప్రజా సమస్యలపై సమాజం పురోగతిపై సమగ్ర అవగాహన కలిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి కి ఎంసిపిఐ యు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు నర్సిరెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి పోరాడే ప్రజా గొంతుకను గెలిపించుకోవాలని కోరారు.సమస్యలపై అవగాహన లేని అవినీతి అవకాశవాద అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈరోజు స్థానిక నర్సంపేట పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంసిపిఐ యు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా పోటీ చేస్తున్న టిఎస్ యుటిఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఆరేళ్ల పాటు ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం శాసనమండలి లో ప్రశ్నించి, సమస్యల పరిష్కారానికి గత బిఆర్ ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లో ముఖ్యమంత్రులు,మంత్రులు, అధికారులతో చర్చించి ఉపాధ్యాయుల పి ఆర్ సి, పదోన్నతులు,ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేశానని అన్నారు.తన పదవికాలంలో ఆరేళ్ల పాటు రెగ్యులర్, కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ లో విద్యా రంగంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళి వాటి పరిష్కారం కోసం పనిచేశానని ఆయన అన్నారు. గతంలో లో కెసిఆర్ ప్రభుత్వం 7.5% పిఆర్సి ఇస్తామంటె 30% సాధించడంలో వారు ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. పాఠశాలలలో మరమ్మత్తులు,అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.ఆరేళ్ల పదవి కాలంలో ప్రభుత్వం తనకు కేటాయించిన తొమ్మిది కోట్ల రూపాయలు విద్యారంగానికి కేటాయించేటట్లు చేసిన ఘనత వారిదే అన్నారు . పాఠశాలలో పారిశుధ్య పనుల కోసం నెలకు పదివేల నుండి ఇరవై వేల రూపాయల వరకు ఇచ్చే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించినట్లు చెప్పారు. రాబోయే మేనెలలో ఉపాధ్యాయ పదోన్నతులు వుంటాయని అయన చెప్పారు. పాత పెన్షన్ విధానం అమలు చేయడానికి ఉద్యోగ సంఘాలతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ ప్రతినిధిగా శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక ఉండే అలుగుబెల్లి నర్సిరెడ్డి ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## ఈ20 పెట్రోల్ పై అవగాహనా సదస్సు



**ఖమ్మం,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):**

ఖమ్మం జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఏదులాపురం నందున్నా అసోసియేషన్ బిల్డింగ్ లో ఈ 20 ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ పై అవగాహన సదస్సు నిర్వహించటం జరిగినది. ఖమ్మం జిల్లా సివిల్ సప్లైస్ ఆఫీసర్ శ్రీ చందన్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ20 పెట్రోల్ లో 20% ఇథనాల్ పెట్రోల్ తో పాటు బ్లెండ్ అయిఉంటుంది. అందులో కొంచెం నీళ్లు కలిసిన 20% ఉన్న ఇథనాల్ నీళ్లుగ మారిపోతుంది.పెట్రోల్ మరియు డీజిల్ క్వాలిటీ ని ఫిల్టర్ పేపర్,డెన్సిటీ తో ఎలా పరీక్షిస్తారు మరియు క్వాంటిటీ ని 5 లీటర్ల క్యాన్ తో ఎలా చెక్ చేస్తారో వివరించారు. ఈ కార్యక్రమంలో బిపిసిఎల్ సేల్స్ ఆఫీసర్ కిషన్,ఐ ఒ పి ఎల్ సేల్స్ ఆఫీసర్ సురేష్, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈశ్వరప్రగడ రంగనాథ్, జనరల్ సెక్రటరి కూరపాటి మంజుల,ట్రెసరర్ వజనెపల్లి శ్రీనివాస రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ లో కీచక పర్వం

**శంషాబాద్ ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):**




డిగ్రీ విద్యార్థి పై ఫ్లోర్ ఇన్చార్జ్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పరపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పరపల్లిలోని విఎంఎస్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిపై డిగ్రీ కళాశాల ఫ్లోర్ ఇంచార్జ్ సుధీర్ విద్యార్థినిని ఇష్టం ఉన్నట్టు చేతులతో తాకుతూ అసభ్యంగా ప్రవర్తించాడని, కుటుంబ సభ్యులకు తెలపడంతో కళాశాలకు చేరుకున్న విద్యార్థిని కుటుంబ సభ్యుల అసభ్యంగా ప్రవర్తించిన సుధీర్ పై దాడి చేసి రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. ఫిర్యాదు స్వీకరించిన రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎండుతున్న సాగర్ ఆయకట్టు పంటలను కాపాడాలి : నున్నా నాగేశ్వరరావు

**-గోదావరి జలాలను యుద్ధ ప్రాతిపదికపై సాగర్ ఆయకట్టుకు తరలించాలి.**



**ఖమ్మం,ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):**

నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో సుమారు రెండు లక్షల ఎకరాలలో మొక్కజొన్న,వరి, మిరప,పెసర తదితర పంటలు ఎండుతున్నాయని, పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ముఖ్యంగా మొక్కజొన్న పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారని, గింజ దశకు చేరిందని, సకాలంలో నీళ్ళు అందకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఎడమ కాలువ పరిధిలో వైరా నుండి దిగువకు గోదావరి జలాలను యుద్ధ ప్రాతిపదికపై సాగర్ కాల్వకు అనుసంధానించి పంటలను కాపాడాలన్నారు. గత సంవత్సరం ఆగస్టులోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించినా,ఇంత వరకు సీతారామ ప్రాజెక్టును అనుసంధానం చేయలేకపోవటం ప్రభుత్వ యంత్రాంగం యొక్క అసమర్థతకు నిదర్శనం అన్నారు.మంత్రులు, అధికారులు స్పందించి సాగునీరు అందించకుంటే రైతాంగం రోడ్ల మీదకు వస్తారని హెచ్చరించారు.

# ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తేవారిని గెలిపించాలి:పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి



విశాఖపట్నం,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):
ఈ నెల 27 న జరుగుతున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని,పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి కోరారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాసనమండలి అంటే పెద్దల సభ అన్నారు. అటువంటి సభలో పిడిఎఫ్ తరపున గెలుపొంది, ఎమ్మెల్సీలుగా పనిచేస్తున్న అభ్యర్థులు ఎంతో హుందాతనంగా, రాజకీయాలకు అతీతంగా, ఉపాధ్యాయుల, ఉద్యోగుల,పెన్షనర్ల,కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. శాసనమండలి ఉద్దేశాన్ని,హోదాని,ఉన్నతిని కాపాడి నిజాయితీగా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రతిరోజు పోరాటం చేస్తున్న పిడిఎఫ్ తరుపున తాను పోటీ చేస్తున్నానని చెప్పారు.విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యలపై తాను పోరాటం చేస్తానన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జివో 117 వల్ల అనేక పాఠశాలలో మూతపడ్డాయి అన్నారు. 3,4,5 తరగతులను హైస్కూల్లో విలీనం చేయటం వల్ల గ్రామీణ ప్రాంతంలో అనేక పాఠశాలలో మూతపడ్డాయని,కనుక జివో 117 ను రద్దు చేస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చిన తెలుగుదేశం కూటమి పార్టీల నాయకులు చెప్పారని, అయితే కూటమి అధికారులకు వచ్చిన తర్వాత ఆ జీవోను నేటి వరకు రద్దు చేయలేదన్నారు.సరి కదా, గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక పాఠశాలల ఉనికి లేకుండా, కూటమి ప్రభుత్వం అనేక సన్నాహాలు చేస్తుందని ఆరోపించారు.ఇదే జరిగితే, మరిన్ని పాఠశాలలో మూతపడటం, ఉపాధ్యాయుల పోస్టులు లేకుండా పోతాయని, ప్రభుత్వ విద్య అందని ద్రాక్ష అవుతుందన్నారు.తాను ఎమ్మెల్సీగా నెగ్గితే జివో 117 రద్దుకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు.పవిత్రమైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కొన్ని రాజకీయ పార్టీలు కలుషితం చేశాయని, రాజకీయ పార్టీలు జోక్యం ఈ ఎన్నికల్లో ఉండటం భావ్యం కాదన్నారు.తాను ఎన్నో మహిళా ఉద్యమాలలో పాల్గొని,ప్రజా సేవ కార్యక్రమాలు చేశానని, రాజకీయాలకు,అవినీతికి తావు లేకుండా,నిజాయితీగా సేవ చేస్తానని,పి ఆర్ సి ఇతర సమస్యలపై శాసనమండలలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు.సుదీర్ఘకాలం ఉపాధ్యాయుల సమస్యలపై పనిచేసి పరిష్కారం దిశగా కృషి చేసిన అనుభవం తనకు ఉందన్నారు.ఆరేళ్ల కాల ఉపాధ్యాయ వృత్తిని వదులుకొని ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసేందుకు ముందుకు వచ్చానన్నారు. విద్యారంగాన్ని దెబ్బతీసే పార్టీలు బలపరిచే అభ్యర్థుల వలన సమస్యలు పరిష్కారం కాబోతున్నారు.బ్యాలెట్ పేపర్ లో 1 వ నెంబర్ లో ఉన్న తనకు ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. లక్ష్మీరాజా,విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, ఎస్సి ఎస్టి ఉపాధ్యాయ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు,అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సుధాకరరావు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ:

**-పంచాయతీ కార్మికుల రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్.**

**-మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలి.**

**-లేదంటే రానున్న రోజుల్లో మరో పోరాటానికి సిద్ధం.. శ్రీనివాస్ వెల్లడి.**



పెద్దేముల్ ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం):
మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరికీ ఎంపీడీవో చేతుల మీదుగా మంగళవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామపంచాయతీ కార్మికులకు ఎంపీడీవో ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. కాగా గ్రామపంచాయతీ కార్మికులకు గత రెండు, మూడు, నెలలుగా జీతాలు పెండింగ్లో ఉన్నాయి...వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్టిఓలో వేసిన చెక్కులు తక్షణమే విడుదల అయ్యేలా, ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఇది ఇలా ఉంటే, గత రెండు, మూడు నెలల నుండి జీతాలు రాక అప్పులు తెచ్చుకొని కుటుంబాన్ని పోషించుకుంటూ గ్రామంలో పేరుకుపోయిన చెత్త చెదారం ఇతర వ్యర్థాలను సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామపంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అభివర్ణించారు. పెండింగ్ జీతాలు వేయాలని గ్రామపంచాయతీ కార్మికులు అందరూ పోరాటానికి సన్నద్ధం కాగానే, మంత్రి సీతక్క ప్రెస్ మీట్ పెట్టి.. జనవరి నెల నుండి కార్మికులకు నేరుగా ప్రభుత్వమే వారి అకౌంట్లో జీతాలు జమ చేస్తుందని చెప్పి, రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు హామీ హామీ గానే మిగిలిపోయింది గాని,ఆచరణలో అమలు పరచలేరని దుయ్యబట్టారు.ఇది ఎక్కడి చోద్యం, మాటలు కోటలు దాటుతున్నవి తప్ప, చేతలు మాత్రం గడప దాటడం లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో భాగంగా... కార్మికులకు ఏవైతే హామీలు ఇచ్చారు, వాటి ప్రకారం పంచాయతీ కార్మికులకు, ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలని, అదేవిధంగా కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని స్పష్టం చేశారు.ఈ మేరకు పంచాయతీ కార్మికుల యొక్క మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి, లేదంటే రానున్న రోజుల్లో కార్మికుల అందరి పక్షాన.. కార్మికులను సంఘటితం చేసి మరో పోరాటానికి సన్నద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జర్నప్ప, ఎంపీఓ రతన్ సింగ్, కొండపూర్ పంచాయతీ కార్యదర్శి రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సిఐటియు మండల నాయకులు రాజు, గ్రామపంచాయతీ కార్మికులు.. మండల అధ్యక్షులు పడగల్ల అంబరప్ప, వీరప్ప, లక్ష్మి, సంగప్ప, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# క్షణక్షణం భయం భయం..!

**-ఏమరపాటు వాయించిన ప్రాణాలచే ప్రమాదం.**

**-నాలుగు రోజులుగా స్పందించని ఏఈ.**

**-ఆందోళన చెందుతున్న రైతన్న.**

పెద్దేముల్ ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):
తమ పొలంలో విద్యుత్ తీగలు క్రిందికి జారి తలకు తాకే ఎత్తులో ఉన్నాయి. క్షణక్షణం భయం భయంగా బ్రతుకుతున్నామని పెద్దేముల్ గ్రామానికి చెందిన "ధర్మిది రాజు" అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తమ పొలంలో విద్యుత్ వైర్లు పూర్తిగా తలకు తాకే స్థితిలోకి జారాయని, విద్యుత్ తీగలను పైకి కట్టండి అని గత నాలుగు రోజుల నుండి పెద్దేముల్ మండల విద్యుత్ అధికారి దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడంలేదని అన్నారు. దీంతో పొలం పనులు చేయాలంటే తీగలు వ్యవసాయ పనిముట్లకు తాకే ఎత్తులో ఉన్నాయి. పొరపాటున తగిలితే గనుక ప్రాణాలు పోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పుడు గనక చేయకపోతే వర్షాకాలంలో అన్ని పొలాల్లో పంటలు వేస్తారు. అప్పుడు చేయాలన్నా సాధ్యం కాదు. అధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ వైర్లను ఒక స్తంభం



సాయంతో పైకి కట్టాలని రైతు రాజు విద్యుత్ అధికారులను డిమాండ్ చేశారు. ఎప్పుడు, ఏ క్షణం ఏం జరుగుతుందోనని బిక్కు బిక్కుమంటూ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని పొలం పనులు చేసుకుంటున్నాము. అనుకోకుండా చేయి పైకి ఎత్తితే విద్యుత్ వైర్లు చేతికి తాకి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఇంత ప్రమాదం ఉంది అని విద్యుత్ అధికారికి పలుమార్లు విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత డివిజన్, జిల్లా అధికారులు స్పందించి మండల విద్యుత్ అధికారి పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా తమ పొలంలో ప్రమాదకరంగా కిందికి జారి ఉన్న విద్యుత్ వైర్లను పైకి కట్టాలని అధికారులను కోరుతున్నాము.

# ఇంటికి వెళ్లాలంటే రోడ్డు దాటేది ఎలా..?

**-సీసీ రోడ్డు బెడ్లు నిర్మించాలని కాలనీవాసులు ఆందోళన.**

బషీరాబాద్ ఫిబ్రవరి 25 (ప్రజాక్షేత్రం)
తమ తమ ఇళ్లలోకి వెళ్లాలంటే విశాలమైన సైడ్ డ్రైన్ ఉంది. సైడ్ డ్రైన్ దాటి ఇంటిలోకి ఎలా వెళ్లాలని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.మండల పరిధిలోని దామర్చేడ్ గ్రామంలో రోడ్డుకి అడ్డంగా పెద్ద మోరీ ఉంది. మేము రోడ్డు ఎలా దాటాలి అని, మోరి దాటుటకు తీవ్ర ఇబ్బంది ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆరవ వార్డు బీసీ కాలనీలో, సిసి రోడ్లు వేశారు. అయితే మురుగు కాలువ పైన ఎలాంటి సి సి రోడ్డు బెడ్లు వేయలేదు. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు.. మరుగు కాలువ దాటాలంటే తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని అన్నారు. ఆటోలు, బైకులు మొదలైన వాహనాలు సైతం లోపలికి వెళ్లలేని పరిస్థితి దాపరించింది. కాలనీవాసులు తాత్కాలికంగా సొంత డబ్బులు ఖర్చు పెట్టి మురుగు కాలువ పైన రాతి బండలు వేసి వెళున్నారు. ప్రమాదవశత్తూ.. మురుగు కాలువ దాటే క్రమంలో బండ విరిగి మొరిలోపడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.ఈ విధంగా ప్రమాదకరంగా ఉన్న మోరీలపైన బెడ్లు వేసి ప్రమాదాలను అరికట్టాలని కాలనీ వాసలు అధికారులను కోరుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం శూన్యం.. గ్రామ యువకుడు వెంకటేష్.





మురుగు కాలువ పైన సీసీ బెడ్డును ఏర్పాటు చేయాలని కాలనీ వాసుల పక్షాన పలుమార్లు నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని యువకుడు వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి తమ తమ ఇళ్లలోకి వెళ్లడానికి వాహనాలకు ప్రజలకు దారిని ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

# మానవతా దృక్పథంతో స్పందించి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు

**-బీ ఆర్ కే న్యూస్ రిపోర్టర్ రామాంజనేయులు**

**-దాతల సహకారంతో వచ్చిన రూ.64 వేలు కర్నూల్ హాస్పటల్లో బాధితురాలు భర్తకు అందించిన బీ ఆర్ కే న్యూస్ రిపోర్టర్ రామాంజనేయులు**

జోగులంబ గద్వాల,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):
గద్వాల పట్టణానికి చెందిన జి. కవిత అంగన్వాడీ టీచర్ బైక్ పైనుంచి కిందపడి బ్రెయిన్ ఆపరేషన్ చేసి కోమాలో ఉన్న విషయాన్ని బీ ఆర్ కే న్యూస్ రిపోర్టర్ రామాంజనేయులు దృష్టికి తీసుకురాగా మానవసేవయే మాధవసేవ గ్రూప్ మరియు సోషల్ మీడియాలో ఇట్టి విషయాన్ని తెలపడంతో మానవతా దృక్పథంతో స్పందించి ఆర్థిక సహాయం అందించిన దాతలకు బాధిత కుటుంబ సభ్యుల తరఫున నుంచి మరియు బీ ఆర్ కే న్యూస్ రిపోర్టర్ రామాంజనేయులు అయినటువంటి నా తరఫునుంచి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. దాతల సహకారంతో వచ్చిన 64,000/- రూపాయలను కర్నూల్ హాస్పిటల్ లో బాధితురాలు భర్తకు అందించడం జరిగింది. గడచిన కొంతకాలం క్రితం కూడా మానవసేవయే మాధవసేవ గ్రూప్ మరియు సోషల్ మీడియా ద్వారా అనారోగ్యాల కారణల వల్ల చిన్న పిల్లలకు – పెద్ద వాళ్లకు కూడా దాతలు అనేక సందర్భాల్లో ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. ముందు ముందు కూడా ఇలాంటి విషయాలను



మానవసేవయే మాధవసేవ – సోషల్ మీడియా ద్వారా అనేక కార్యక్రమాలకు మీ అందరి ఆ సహాయ సహకారాలు అందిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరొకసారి ఆర్థిక సహాయం అందించిన దాతలకు వారి కుటుంబ సభ్యులకు అందరి దేవుళ్ళ ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికే మా మద్దతు.



నాంపల్లి,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):
బిజెపి నాంపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నాంపల్లి, పస్నూర్, ముష్టిపల్లి హైస్కూల్,మోడల్ స్కూల్,కస్తూర్బ గాంధీ పాఠశాలలో పెద్దఎత్తున ఓటర్లను కలవడం జరిగింది.ఈ సందర్భంగా గోగిరెడ్డి లచ్చిరెడ్డి మాట్లాడుతూ జాతీయవాదం తోడుగా స్ఫూర్తివంతమైన,నిజాయితీ గల నాయకుడైన సరోత్తంరెడ్డి గారికే మా ఓటని ఉపాధ్యాయులు మద్దతు తెలియజేసారని అన్నారు.రాబోయే హెల్త్ కార్డులకోసం,ఏకీకృత సర్వీస్ సాధించడం కోసం,ఘనమైన పిఆర్ సి కోసం,రావలసిన 5 డిఏ లు వాటి బకాయిలను,పెండింగ్ బిల్లులను మంజూరు చేయడానికి,ఉపాధ్యాయుల అధ్యాపకుల,ప్రొఫెసర్ ల ఆత్మ గౌరవం నిలబడడానికి, ఎస్ఎస్ఏ,కెజిబివి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి,వారికి రావలసిన ఎంటిఎస్ కోసం మోడల్ స్కూల్,గురుకులాల సమస్యల పరిష్కారానికి,ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యా సాధన కోసం,యావత్ ఉపాధ్యాయుల క్షేమం కోసం పని చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దాచేపల్లి నరసింహ,ఎంఎల్సి ఎన్నికల ఇన్చార్జి బిజెవైఎం మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్, పొలగోని శ్రీకాంత్,కామిశెట్టి శ్రీనివాస్ తదితులు పాల్గొన్నారు.

## తుపత్రాల బుడ్డన్న కుమారుడు పరశురాముడుని పరామర్శించిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి,ఎమ్మెల్యే విజయుడు,బీఆర్ఎస్వి జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య



ఐజ,ఫిబ్రవరి 25(ప్రజాక్షేత్రం):
అలంపూర్ నియోజకవర్గం ఐజ మండలంలోని తుపత్రాల గ్రామంలో గత కొన్ని నెలలుగా బుడ్డన్న కుమారుడు పరశురాముడు అనారోగ్య సమస్యలతో బాధపడుతూన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి,అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, తుపత్రాల బుడ్డన్న ఇంటికి వెళ్లి పరశురాముడుని పరామర్శిస్తూ ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటూ, ఆయనకు ధైర్యం చెప్పుతూ తొందరగా నీ ఆరోగ్యం మెరుగుపడాలని పరశురాముడు తో వారు అన్నారు. అనంతరం అయిజ పట్టణ కేంద్రంలోని మాజీ జడ్పీటీసీ ఏక్లాస్పురం నరసింహారెడ్డి నివాసం నందు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పార్టీ నాయకులతో మాట్లాడుతూ మండల %డ% పట్టణ కేంద్రంలో పలు విషయాలను,సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మూసీ ప్రక్షాళనలో మొదటి తట్ట నేనే ఎత్తుతా

**31 లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ పథకం లబ్ధి**

అనేక అడ్డంకులు, ఇబ్బందులు, ఆర్థిక సమస్యలు ఉన్నా రంఛన్ గా పీఎం కిసాన్ నిధులు కేంద్రం మంజూరు చేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశంలో రైతాంగానికి అండగా నిలబడ్డ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వమని అన్నారు. సోమవారమే పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాల్లో వేశారని పేర్కొన్నారు. సంవత్సరానికి మూడుసార్లు ఒక్కరోజు ఆలస్యం గాకుండా ప్రతీ రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. వందకు వందశాతం రైతుల పంట ఉత్పత్తులు పెంపుదలకు, ఎరువులు, విత్తనాలు, సాగు ఖర్చుకు బ్యాంకుల చుట్టూ వెళ్లకుండా ఈ నిధులు ఉపయోగపడుతున్నాయని ఆయన తెలిపారు. 19వ విడత డబ్బులు 9.08 కోట్ల మంది అకౌంట్లలో రూ. 22 కోట్లు జమ చేశామని అన్నారు. దీనిద్వారా తెలంగాణలో 31 లక్షల మంది రైతులు లబ్ధి పొందారన్నారు. డైరెక్టర్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ కింద పీఎం కిసాన్ సన్మాన్ నిధి డబ్బులు అందజేస్తున్నామని వివరించారు.

**మేధావులు, విద్యావంతుల గొంతుక బిజెపి**

పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించిన ప్రచారం కొద్దిసేపట్లో ముగియనుందని అన్నారు. ఎన్నికల్లో బీజేపీ ఓటర్లను వ్యక్తిగతంగా కలిసేందుకు ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు. ఆ విధంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, కింది స్థాయిలోని ఓటర్లను కలిసే కార్యక్రమాలను చేపట్టామన్నారు. చట్టసభల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యలు వినిపించే వారికే ఓటు వేసి గెలిపించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శాసనమండలిలో వారి గుండెచప్పుడుగా మారి వారి గొంతుకను బీజేపీ వినిపిస్తుందన్నారు. మూడు సీట్లలో ఒక్క సీటులోనే కాంగ్రెస్ పోటీ చేస్తుందన్నారు. మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు ఎవరినో ఒకరిని ఎన్నుకుంటే లాభం లేదన్నారు. శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకలు, ప్రభుత్వాలను నిలదీసే సత్తా ఉన్న ఏకైక పార్టీ బీజేపీ పార్టీ అని అన్నారు. మూడు స్థానాల్లోనూ బీజేపీ పోటీ చేస్తుందని ఆశీర్వదించి అండగా నిలవాలని కేంద్రమంత్రి విజ్ఞప్తి చేశారు.